Follow: @ANNTELUGU
03-08-2026
ANN తెలుగు
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 211 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఫుడ్ డెలివరీ మార్కెట్‌లోకి ఫ్లిప్‌కార్ట్

- జొమాటో, స్విగ్గీకి గట్టి పోటీ
- ఆగస్టు 15 నుంచి బెంగళూరులో పైలట్ సేవలు.
- తక్కువ కమిషన్‌తో రెస్టారెంట్లను ఆకర్షించే వ్యూహం

**బెంగళూరు, మహా :** ఈకామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ ఫుడ్ డెలివరీ రంగంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమైంది. ఇప్పటికే ఆన్‌లైన్ షాపింగ్, క్విక్ కామర్స్ సేవలు అందిస్తున్న సంస్థ, ఆగస్టు 15 నుంచి బెంగళూరులో పైలట్ ప్రాజెక్ట్‌గా ఆహార డెలివరీ సేవలను ప్రారంభించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ రంగంలో ఆధిపత్యం చెలాయిస్తున్న జొమాటో, స్విగ్గీలకు ఫ్లిప్‌కార్ట్ రాకతో గట్టి పోటీ ఏర్పడే అవకాశం కనిపిస్తోంది. ఫుడ్ డెలివరీ సేవల కోసం ఫ్లిప్‌కార్ట్ ప్రత్యేక మొబైల్ యాప్‌ను తీసుకురానుంది. ప్రస్తుతం బెంగళూరులో రెస్టారెంట్లను భాగస్వాములుగా చేర్చే ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. పైలట్ ప్రాజెక్ట్‌కు లభించే స్పందన ఆధారంగా మిగతా 2వ పేజీలో

### టాప్ న్యూస్

## ట్రంప్ కీలక నిర్ణయం

- ఇరాన్‌పై దాడులు బంద్
- పశ్చిమాసియా దేశాల అభ్యర్థన మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి



02

## రాజకీయాల్లోకి 'కాక్రోచ్ జనతా పార్టీ'?

- ఆగస్టు 5న కీలక నిర్ణయం
- వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే నేతృత్వంలో కోర్ కమిటీ కీలక సమావేశం




02

## జగన్ వల్లే భోగాపురం లేటు

- మొత్తం మేం నిర్మిస్తే.. క్రెడిట్ మీకా
- కేంద్రమంత్రి పెమ్మసాని ఫైర్



02



# బోనమెత్తిన లష్కర్

భాగ్యనగరమంతా..

# బోనాల జోరే

- మహంకాళి అమ్మవారికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకపూజలు
- అమ్మవారిని దర్శించుకున్న కేంద్రమంత్రి బండి సంజయ్, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, కేటీఆర్, ఈటల, రాష్ట్రమంత్రులు



**హైదరాబాద్, మహా :** లష్కర్ బోనమెత్తింది. భక్తుల సందడితో కిటకిటలాడింది. భక్తుల పలారం బండ్లు, శోభాయాత్రలు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలతో సిటీ అంతా కోలాహలంగా మారింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో వైభవంగా జరుగుతున్న బోనాల పండుగ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సికింద్రాబాద్‌లోని ప్రముఖ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజల తరపున దర్శనం చేసుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం సీఎం రేవంత్ రెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశాను. మన తెలంగాణ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రజలందరూ పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండేలా చూడాలని ఆ జగన్మాతను మనసారా ప్రార్థించాను' అని సీఎం తన సందేశంలో పేర్కొన్నారు. పండుగ వేళ ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లను ప్రభుత్వం తరపున పర్యవేక్షిస్తున్నట్లుగా అధికారులు వెల్లడించారు. సీఎం వెంట ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, టీపీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తది`తరులు అమ్మవారిని దర్శించుకున్నారు. మంత్రి కొండాసురేఖ దేవాదాయ శాఖ తరపున మిగతా 3వ పేజలో



# స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఎక్కడ..!

సీఎంసీ ఆర్డర్స్ కాగితాలకే పరిమితమా..!

సీఎంసీ పరిధిలో అంతులేని అక్రమ నిర్మాణాలు...!

### ప్రభుత్వ సర్వే నెం.11/33, 11/34 లలో యథేచ్ఛగా బహుళ అంతస్థుల నిర్మాణాలు...!

02

- జీహెచ్ఎంసీ ఉన్నప్పుడే మేలు అంటున్న స్థానికులు...!
- సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో పడకేసిన పాలన...!
- హైడ్రా నిఘా కరువుతో పెట్రేగిపోతున్న బిల్డర్లు...!
- కలెక్టర్, సీఎంసీ, జోనల్ కమిషనర్లకు ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ...!
- ప్రజావాణితో ప్రజలకు ఒరిగిందేమిటి...!
- చర్యలు శూన్యం.. బుట్టదాఖలవుతున్న ఫిర్యాదులు...!
- సీఎం శాఖలోనే తాండవిస్తున్న అవినీతి అక్రమాలు...!

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజా పాలన పడకేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతులేని అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నప్పటికీ వాటిపై చర్యలు తీసుకోకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసిన కమిషనర్ ఆర్డర్స్ కాగితాలకే పరిమితమయ్యాయా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి కూతవేటు దూరంలో, కూకట్‌పల్లి జోన్ ఖానామెట్‌లోని బుట్టా కన్వెన్షన్ పక్కన ప్రభుత్వ సర్వే నంబర్లు 11/33, 11/34 లలో యథేచ్ఛగా బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయంటూ కలెక్టర్, సీఎంసీ, జోనల్ కమిషనర్‌లకు ప్రజావాణిలో ఫిర్యాదులు వెల్లువెత్తినప్పటికీ చర్యలు తీసుకునేందుకు అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తోందని బహిరంగ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పేరుకే ప్రజావాణి.. దాని వల్ల ప్రజలకు ఒరిగిందేమిటని స్థానికులు ఎద్దేవా చేస్తున్నారు. హైడ్రా నిఘా లేకపోవడం, క్షేత్రస్థాయి తనిఖీలు జరగకపోవడంతో కొందరు బిల్డర్లు ప్రభుత్వ భూముల్లోనూ నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. సీఎం ఆధ్వర్యంలో ఉన్న కీలకమైన మున్సిపల్ శాఖలో అవినీతి, అక్రమాలు తాండవిస్తున్నాయనడానికి అధికారుల పనితీరే అద్దం పడుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన కోట్లాది రూపాయల సొమ్ము పక్కదారి పడుతోందని వారు అభిప్రాయపడుతున్నారు.

## వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్

### 14రోజుల రిమాండ్



**కర్నూలు, మహా :** వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షిని కర్నూలు జిల్లాలోని చిప్పగిరిలో పోలీసులు అరెస్ట్ చేశారు. విరూపాక్షికి ఆలూరు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఇసుక వివాదంతో పాటు టీడీపీ నేతలపై దాడి కేసులో ఆయన్ను అరెస్ట్ చేసి ధర్మాసనం ఎదుట ప్రవేశ పెట్టారు. దీంతో ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు.. విరూపాక్షితో పాటు 15 మంది వైసీపీ కార్యకర్తలకు రిమాండ్ విధించింది. టీడీపీ నేత ఫిర్యాదుతో విరూపాక్షిపై హత్యాయత్నం కేసుతో పాటు అట్రాసిటీ కేసును పోలీసులు నమోదు చేశారు. ఈ కేసులో విరూపాక్షిని అదుపులోకి తీసుకున్న పోలీసులు పోలీస్ స్టేషన్‌లో సుదీర్ఘ విచారణ అనంతరం అరెస్ట్ చేసి వైద్య పరీక్షల తర్వాత కోర్టులో ప్రవేశ పెట్టారు.

డా. శాఖమూరి శ్రీనివాస ప్రసాద్‌కు

## 'రతన్ టాటా విజనరీ ఐకాన్' అవార్డు

02

- సీబీఎన్ @ 361 డిగ్రీస్
- పాలిమత్' పుస్తకానికి దక్కిన అరుదైన గౌరవం



## డ్రగ్స్ పీడ వదలాలి

- 'నషా ముక్త యువ' ప్రారంభించిన ప్రధాని మోదీ.

02






# స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఎక్కడ..!




**మహా, స్టేట్ బ్యూరో చీఫ్:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, శేరిలింగంపల్లి మండలం, కూకట్‌పల్లి జోన్ ఖానామేట్ బుట్టా కన్వెన్షన్ పక్కనే ప్రభుత్వ సర్వే నంబర్లు 11/33, 11/34 లలో సుమారు 4000 చదరపు గజాల సర్కారు భూమిలో బహుళ అంతస్థుల అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నప్పటికీ వాటిని నియంత్రించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందనే విమర్శలు రోజురోజుకూ బల పడుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపేందుకు, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించిన అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడంలో విఫలం అయ్యారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. కోట్ల రూపాయల విలువ చేసే విలువైన ప్రభుత్వ ఆస్తులను కళ్లముందే ఆక్రమించి భారీ భవంతులు నిర్మిస్తున్నా సంబంధిత ప్లానింగ్, రెవెన్యూ విభాగాలు ప్రేక్షకపాత్ర వహిస్తుండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**స్పెషల్ టాస్క్‌ఫోర్స్ కేవలం కాగితాలకే పరిమితమా..?**

అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ ఘనంగా ప్రకటించారు. అక్రమ నిర్మాణాలను గుర్తించి వెంటనే కూల్చివేస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అధికారులు ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తోందని స్థానికులు మండి పడుతున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏర్పాటైన తర్వాత కూడా వివాదాస్పద నిర్మాణాలు నిరంతరాయంగా కొనసాగుతుండటంతో "స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఎక్కడ?" అన్న ప్రశ్నలు స్థానిక ప్రజల నుండి ఉత్పన్నమవుతున్నాయి.

**ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు.. ఎవరి అండతో..?**

ఖానామెట్‌లోని సర్వే నెంబర్లు 11/33, 11/34 ప్రభుత్వ భూములుగా నమోదై ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. స్వయంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఈ భూములను ప్రభుత్వ భూములుగా పరిగణిస్తూ 22 (ఎ) నిషేధిత జాబితాలో చేరుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయినప్పటికీ అవే ప్రభుత్వ భూముల్లో అక్రమార్కులు యథేచ్ఛగా బహుళ అంతస్తులు, వ్యాపార సముదాయాల నిర్మాణాలు సాగిస్తున్నా వాటిని అడ్డుకునేందుకు అధికారులు ముందుకు రాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అక్రమ నిర్మాణాలు ప్రారంభ దశలోనే అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం ఆ నిర్మాణాలు పూర్తయ్యే వరకు అటువైపు కన్నెత్తి చూడకపోవటం, ఎందుకు మౌనంగా ఉంటున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**హైడ్రా, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ శాఖలు ఏం చేస్తున్నాయి**

ప్రభుత్వ భూముల పరిరక్షణలో కీలక పాత్ర పోషించాల్సిన రెవెన్యూ శాఖ, అక్రమ నిర్మాణాల నియంత్రణ బాధ్యత కలిగిన టౌన్ ప్లానింగ్ విభాగం, ఆక్రమణల నివారణ కోసం ప్రత్యేకంగా పనిచేస్తున్న హైడ్రా వంటి సంస్థలు ఈ వ్యవహారంపై ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూములను ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు కళ్లముందే కొనసాగుతున్నప్పటికీ సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తున్నాయి .

చిన్న చిన్న ఉల్లంఘనల పేరుతో పేదలపై విరుచుకు పడే అధికార యంత్రాంగం, వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూముల్లో భారీ స్థాయిలో నిర్మాణాలు కొనసాగిస్తున్నప్పటికీ పెద్దల జోలికి వెళ్లడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. "పేదలకు ఒక న్యాయం.. పెద్దలకు మరో న్యాయమా?" అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఆరు అంతస్తుల నిర్మాణం పూర్తయి, ఏడో అంతస్తు నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖలు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని వారు అంటున్నారు. ఇదే నిర్మాణాన్ని గతంలో టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చి వేశారు. తిరిగి మళ్ళీ నిర్మాణాలు చేపడుతుంటే అడ్డుకుని క్రిమినల్ కేసులు పెట్టాల్సిన అధికారులు భవనం పూర్తయ్యే వరకు ఎందుకు మౌనం వహిస్తున్నారో సమాధానం చెప్పాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**పేరుకే ప్రజావాణి.. ప్రజలకు ప్రయోజనం ఎక్కడ..?**

ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంపై కూడా స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులు స్వీకరించడం వరకు బాగానే ఉన్నప్పటికీ వాటిపై చర్యలు తీసుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని ఆరోపిస్తున్నారు. "పేరుకే ప్రజావాణి.. దాని వల్ల ప్రజలకు ఒరిగిందేమిటి?" అని స్థానికులు పెదవి విరుస్తున్నారు. ఫిర్యాదులు బుట్టదాఖలవుతున్నాయనే భావన ప్రజల్లో బలపడుతోందని చెబుతున్నారు.

**ప్రజావాణిలో వెల్లువెత్తిన ఫిర్యాదులు:**

ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, సీఎంసీ కమిషనర్, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌లకు ప్రజావాణి ద్వారా పలుమార్లు ఫిర్యాదులు అందజేసినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ భూముల్లో జరుగుతున్న నిర్మాణాలపై విచారణ జరిపి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరినా, ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన స్పందన రాలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులు ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి తిరుగుతున్నాయే తప్ప సమస్య పరిష్కారం కావడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**హైకోర్టు సుమోటోగా స్వీకరించాలని స్థానికుల విజ్ఞప్తి..!**

ఖానామెట్‌లోని సర్వే నెంబర్లు 11/33, 11/34 లలో సుమారు 4 వేల చదరపు గజాలు, వంద కోట్ల పైనే విలువైన ప్రభుత్వ భూమికి సంబంధించిన భూ రికార్డులు, నిర్మాణ అనుమతులు, సంబంధిత శాఖల పాత్రపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, ఈ వ్యవహారాన్ని తెలంగాణ హైకోర్టు సుమోటోగా స్వీకరించి ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజావాణిలో పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత శాఖల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడంతో ప్రజల్లో అనుమానాలు మరింత బలపడుతున్నాయని పేర్కొంటున్నారు. ప్రభుత్వ భూములపై జరుగుతున్న అక్రమ నిర్మాణాలు వెంటనే నిలిపివేసి, సంబంధిత అనుమతుల జారీ ప్రక్రియ, భూ రికార్డుల నిర్వహణ, పర్యవేక్షణలో ఏవైనా లోపాలు జరిగాయా అనే కోణంలో సమగ్ర దర్యాప్తు జరపాలని కోరుతున్నారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన ఈ వ్యవహారంలో నిజానిజాలు నిగ్గు తేల్చి, తప్పులు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

హైటెక్ సిటీ సమీపంలో అత్యంత విలువైన భూములకు సంబంధించిన ఈ అంశం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతున్న నేపథ్యంలో, హైకోర్టు స్పందించి ఉన్నతస్థాయి స్వతంత్ర దర్యాప్తు సంస్థలు జోక్యం చేసుకునేల ఆదేశాలు జారీ చేసి, వాస్తవాలను వెలికితీయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రజా ఆస్తులను కాపాడే విషయంలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించి పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.




కాగితాలకే పరిమితమైన స్పెషల్ టాస్క్ ఫోర్స్ నియామకం

**మీనమేషాలు లెక్కిస్తున్న అధికార యంత్రాంగం:**

ఫిర్యాదులు అందిన తర్వాత క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టడం, నిర్మాణాలకు సంబంధించిన అనుమతులను పరిశీలించడం, నిబంధనల ఉల్లంఘనలు ఉంటే నిర్మాణాలను నిలిపివేయడం వంటి చర్యలు తీసుకోవాల్సి ఉండగా అధికార యంత్రాంగం మాత్రం మీనమేషాలు లెక్కిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. చర్యలు తీసుకోవడంలో జాప్యం వెనుక కారణాలేమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది.ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే, వాటిని కూల్చివేయాల్సిన బాధ్యత టౌన్ ప్లానింగ్ అధికారులదంటూ చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదే విషయాన్ని టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్తే, నిర్మాణాలు ప్రభుత్వ భూమిలో జరుగుతున్నందున ఆక్రమణలను అడ్డుకోవడం రెవెన్యూ శాఖ బాధ్యత అంటూ పరస్పరం నిందారోపణలు చేసుకుంటూ కాలయాపన చేస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. శాఖల మధ్య సమన్వయ లోపం, బాధ్యతారాహిత్య ధోరణి కారణంగా నిర్మాణాలు నిరాటంకంగా కొనసాగుతూ ప్రస్తుతం నిర్మాణాలు పూర్తయ్యే దశకు చేరుకుని, గృహ ప్రవేశాలకు కూడా సిద్ధమవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.
























# ఫుడ్ డెలివరీ మార్కెట్‌లోకి ఫ్లిప్‌కార్ట్

(మొదటి పేజీ తరువాయి )

సేవలను హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నైతో పాటు ఇతర ప్రధాన నగరాలకు విస్తరించే ప్రణాళికను సంస్థ రూపొందించినట్లు తెలుస్తోంది.

**తక్కువ కమిషన్‌తో కొత్త వ్యూహం**

ప్రస్తుతం జొమాటో, స్విగ్గీ సంస్థలు రెస్టారెంట్ల నుంచి సుమారు 16 నుంచి 30 శాతం వరకు కమిషన్ వసూలు చేస్తున్నాయి. అయితే ఫ్లిప్‌కార్ట్ మాత్రం కేవలం 10 శాతం కమిషన్ మాత్రమే వసూలు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. తక్కువ కమిషన్ ద్వారా ఎక్కువ రెస్టారెంట్లను తమ వేదికపైకి తీసుకురావడమే సంస్థ ప్రధాన వ్యూహంగా భావిస్తున్నారు.

**వినియోగదారులకు లాభం.. రెస్టారెంట్లకూ ప్రయోజనం**

ఫుడ్ డెలివరీ రంగంలో పోటీ పెరగడంతో వినియోగదారులకు మెరుగైన డిస్కౌంట్లు, తక్కువ డెలివరీ ఛార్జీలు, వేగవంతమైన సేవలు అందే అవకాశం ఉంది. మరోవైపు తక్కువ కమిషన్ కారణంగా రెస్టారెంట్ల లాభదాయకత కూడా పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.ఇటీవల రాపిడో కూడా 'ఓన్లీ' పేరుతో ఫుడ్ డెలివరీ రంగంలోకి ప్రవేశించగా, ఇప్పుడు ఫ్లిప్‌కార్ట్ ఎంట్రీతో భారత ఫుడ్ డెలివరీ మార్కెట్‌లో పోటీ మరింత ఆసక్తికరంగా మారనుంది. జొమాటో, స్విగ్గీ ఆధిపత్యానికి సవాల్ విసురుతూ కొత్త వ్యాపార వ్యూహాలతో ఫ్లిప్‌కార్ట్ ఎంత మేర విజయవంతమవుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

# డా. శాఖమూరి శ్రీనివాస ప్రసాద్‌కు

- 'రతన్ టాటా విజనరీ ఐకాన్' అవార్డు
- సీబీఎన్ @ 361 డిగ్రీస్ - ది పాలిమత్' పుస్తకానికి దక్కిన అరుదైన గౌరవం



**హైదరాబాద్, మహా :** ప్రముఖ రచయిత, మేధావి డాక్టర్ శాఖమూరి శ్రీనివాస ప్రసాద్‌ను ప్రతిష్ఠాత్మక 'రతన్ టాటా విజనరీ ఐకాన్ అవార్డు 2026' (గ్లోబల్ విజనరీ హానర్) వరించింది. ఆయన రచించిన 'సీబీఎన్ @ 361 డిగ్రీస్ ది పాలిమత్' అనే అద్భుతమైన పుస్తకానికి గాను, సాహిత్యం , పరిశోధన రంగాల్లో ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా జిర్వాన్ ఫౌండేషన్ ఈ అరుదైన పురస్కారాన్ని ప్రకటించింది. నాయకత్వం, సుపరిపాలన, ఆవిష్కరణలు, సాంకేతికత, సుస్థిర అభివృద్ధి, దేశ నిర్మాణం తదితర అంశాలపై దార్శనిక ఆలోచనలతో, బహుముఖ జ్ఞానంతో డాక్టర్ శ్రీనివాస ప్రసాద్ చేసిన లోతైన విశ్లేషణకు ఈ అవార్డు దక్కింది. ఈ పుస్తకం ద్వారా పాఠకులకు ప్రగతిశీల ఆలోచనలను, సమగ్ర దృక్పథాన్ని అందించారని అవార్డు ప్రశంసాపత్రంలో ప్రదాతలు ప్రత్యేకంగా ప్రస్తావించారు. విద్యా, పరిశోధన, దార్శనిక నాయకత్వం ద్వారా వర్తమాన, భవిష్యత్ తరాలకు ఆయన అందిస్తున్న మేధోపరమైన సాధికారతను ఈ సందర్భంగా కొనియాడారు. భారత ప్రభుత్వ నీతి ఆయోగ్ (ఎన్‌జీఓ దర్పణ్), ఎంఎస్ఎంఈ వద్ద నమోదైన జిర్వాన్ ఫౌండేషన్ గత నెల జులై 29 తేదీన ఈ పురస్కారాన్ని ఖరారు చేసింది. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఈఆర్. ఆకాష్ సాహు, మేనేజింగ్ డైరెక్టర్ అశుతోష్ సింగ్ సంతకాలతో కూడిన ఈ ప్రశంసాపత్రాన్ని డాక్టర్ ప్రసాద్‌కు అందజేశారు. సాహిత్యం, మేధోపరమైన రంగాల ద్వారా సమాజానికి ఆయన అందిస్తున్న సేవలు భవిష్యత్తులోనూ విజయవంతంగా కొనసాగాలని వారు ఆకాంక్షించారు.

# రాజకీయాల్లోకి 'కాక్రోచ్ జనతా పార్టీ'?

**ఆగస్టు 5న కీలక నిర్ణయం**




మహా : ఆన్‌లైన్ వేదికగా యువతను సమీకరించి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఇప్పుడు కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. రాజకీయాల్లోకి ప్రవేశించాలా, లేక ఉద్యమ సంస్థగానే కొనసాగాలా అనే అంశంపై ఆగస్టు 5న తుది నిర్ణయం తీసుకోనుంది. ఈ మేరకు పార్టీ వ్యవస్థాపకుడు, జెన్‌జీ ఐకాన్‌గా గుర్తింపు పొందిన అభిజీత్ దీప్కే తన నివాసంలో కోర్ కమిటీ సభ్యులతో సమావేశం కానున్నారని విశ్వసనీయ వర్గాలు ఆదివారం తెలిపాయి. వివిధ రాష్ట్రాల్లోని మద్దతుదారుల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేయనున్నారు. సమావేశం ముగిసిన తర్వాత అభిజీత్ దీప్కే మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తారని పార్టీకి చెందిన ఒక ప్రతినిధి తెలిపారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ నిర్వహించిన నిరసన విజయవంతం కావడం, దాని ఫలితంగా అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో ఈ ఉద్యమ సంస్థపై అంచనాలు భారీగా పెరిగాయి. అయితే, విద్యార్థులు, యువత సమస్యలపై స్పందించే 'రెస్పాన్స్ గ్రూప్'గానే సీజేపీని కొనసాగిస్తామని అభిజీత్ గతంలోనే స్పష్టం చేశారు. శాంతియుత, ప్రజాస్వామ్య పద్ధతులకే కట్టుబడి ఉంటామని, ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా మారబోమని, ఏ పార్టీలోనూ విలీనం కాబోమని ఆయన పునరుద్ఘాటించారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 5న జరిగే సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.

## ట్రంప్ కీలక నిర్ణయం

**ఇరాన్‌పై దాడులు బంద్**

**మహా :** ఇరాన్‌పై చేపట్టిన వైమానిక దాడులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌తో పాటు పశ్చిమాసియా దేశాల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ట్రూత్ సోషల్ వేదికగా వెల్లడించారు. అయితే ఇది శాశ్వత నిర్ణయం కాదని, ఇరాన్‌తో త్వరితగతిన శాంతి ఒప్పందం కుదిరితేనే దాడుల నిలిపివేత కొనసాగుతుందని స్పష్టం చేశారు. "ప్రపంచ భవిష్యత్ ప్రయోజనాల దృష్ట్యా, విజయవంతమైన, సంపన్నమైన ఇరాన్ మనుగడ కోసం వేగంగా ఒక ఒప్పందం కుదుర్చుకునే షరతుతో దాడులను నిలిపివేయడానికి అంగీకరించాను" అని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. యుద్ధానికి ముగింపు పలికే శాంతి ఒప్పందం కోసం అమెరికాతో కలిసి పనిచేయడానికి ఇజ్రాయెల్ కూడా అంగీకరించిందని ట్రంప్ వెల్లడించారు. అయితే ఈ ప్రకటనపై ఇరాన్ ప్రభుత్వం తక్షణమే ఎలాంటి అధికారిక స్పందన ఇవ్వలేదు. ఇటీవలే టెహ్రాన్‌ను చర్చల బల్లపైకి తీసుకురావడానికి అవసరమైతే భారీ సైనిక చర్యలు పునఃప్రారంభిస్తామని అమెరికా హెచ్చరించిన నేపథ్యంలో ట్రంప్ తాజా ప్రకటనకు ప్రాధాన్యం ఏర్పడింది.

# డ్రగ్స్ పీడ వదలాలి

**'నషా ముక్త యువ'ప్రారంభించిన ప్రధాని మోదీ.**



ఢిల్లీ, మహా : దేశ యువతను మాదకద్రవ్యాల బారినుంచి కాపాడి, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి శ్రీకారం చుడుతూ ప్రధాని నరేంద్ర మోదీ 'నషా ముక్త యువ' జాతీయ కార్యక్రమాన్ని ప్రారంభించారు. యువతలో చైతన్యం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను పెంపొందించే లక్ష్యంతో ఈ సమగ్ర ప్రచార కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'వికసిత్ భారత్-2047' లక్ష్య సాధనకు దేశ యువత ఆరోగ్యంగా, మానసికంగా దృఢంగా ఉండటం అత్యంత అవసరమని ప్రధాని అన్నారు. ఈ కార్యక్రమం కేవలం వ్యక్తులను డ్రగ్స్‌కు దూరంగా ఉంచడానికే కాకుండా కుటుంబాలు, సమాజం, దేశ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని రూపొందించామని చెప్పారు. గత ఏడాది వారణాసి (కాశీ)లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన 'నషా ముక్త యువ'కు విశేష స్పందన లభించడంతో ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించినట్లు వెల్లడించారు. ఈ ఉద్యమంలో ఇప్పటికే 125 ఆధ్యాత్మిక సంస్థలు భాగస్వాములయ్యాయని, డ్రగ్స్ రహిత భారత నిర్మాణానికి తమవంతు కృషి చేస్తున్నాయని తెలిపారు. ఒక్క వ్యక్తి ప్రయత్నంతో ఇలాంటి సామాజిక సమస్యలను పూర్తిగా నిర్మూలించడం సాధ్యం కాదని, సమిష్టి కృషితోనే విజయాన్ని సాధించవచ్చని ప్రధాని పేర్కొన్నారు. అనేక మంది కలిసికట్టుగా ముందుకు వస్తే ఆ ఐక్యతే గొప్ప శక్తిగా మారుతుందని, ఇప్పటికే లక్షలాది మంది యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారని వెల్లడించారు.'నషా ముక్త యువ' కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా ప్రతి ఆదివారం మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు వాకథాన్‌లు, క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చర్చావేదికలు, ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రధాని తెలిపారు. డ్రగ్స్ రహిత యువతే అభివృద్ధి చెందిన భారతదేశానికి పునాది అని, ప్రతి యువకుడు తన కుటుంబం, సమాజం, దేశం కోసం మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.

## జగన్ వల్లే భోగాపురం లేటు

**మొత్తం మేం నిర్మిస్తే.. క్రెడిట్ మీకా : కేంద్రమంత్రి పెమ్మసాని ఫైర్**

**ఢిల్లీ, మహా :** విజయనగరం జిల్లా భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం జగన్ వల్లే ఆలస్యమైందని, లేదంటే ఎప్పుడో పూర్తి అవ్వాల్సిందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. 2017లో సీఎం చంద్రబాబు భోగాపురం ఎయిర్ పోర్టు గురించి ఆలోచించారని తెలిపారు. 2700 ఎకరాల్లో 2200 ఎకరాలు భూములను సేకరించారని స్పష్టం చేశారు. '2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. కొన్ని కేసులు వేసింది. వైసీపీ 300 ఎకరాలు మాత్రమే. ఎయిర్ పోర్టులో నిర్మాణ పనుల్లో అవినీతి జరిగిందని కోర్టులో రిటెండర్ వేయడంతో భోగాపురం ఆలస్యమైంది.' అని గుర్తు చేశారు. ఎయిర్ పోర్టు మొత్తాన్ని తాము నిర్మిస్తే జగన్ పార్టీకి క్రెడిట్ ఎలా దక్కుందని పెమ్మసాని చంద్రశేఖర్ నిలదీశారు.

## ప్రధాని మోదీకి స్వాగతం

**మైసూరు, మహా:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మైసూర్ పర్యటన సందర్భంగా బీజేపీ జాతీయ సహ ఇన్‌చార్జి డా. పొంగులేటి సుధాకర్ రెడ్డి ఆయనకు ఘన స్వాగతం పలికారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సహ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన స్వాగత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీతో ఆత్మీయంగా పలకరించారు. దక్షిణాదిలో పార్టీ బలోపేతంలో డా. పొంగులేటి కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో ఆయనకు జాతీయ నాయకత్వం ఇస్తున్న ప్రాధాన్యం మరోసారి స్పష్టమైందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.





# పట్నం రుక్కమ్మకు నివాళులర్పించిన సీఎం రేవంత్ రెడ్డి

- హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, ఎంపీలు, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి

**మొయినాబాద్ మహా :** మాతృవియోగానికి గురైన పట్నం కుటుంబాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పరామర్శించారు. ఆదివారం రోజున మొయినాబాద్ సమీపంలోని జేపిఎల్ కన్వెన్షన్ లో నిర్వహించిన దశ దినకర్మలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు దుద్దేళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్కలతో కలిసి హాజరై రుకమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా పట్నం మహేందర్ రెడ్డిని పట్నం సునీతమ్మ ను పలకరించారు. అలాగే కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని, షాబాద్ మాజీ జెడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డిని సైతం పలకరించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఈర్లపల్లి శంకర్, మధుసూదన్ రెడ్డి, బీరం హర్షవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ గండి విట్టల్, మాజీ ఎమ్మెల్యేలు కే.ఎస్. రత్నం, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# జన్మదిన వేడుకల్లో సేవా కార్యక్రమాలు

- రక్తదానం, అన్నదానంతో బీఆర్ఎస్ నేత శ్రీకాంత్ రెడ్డి
- ప్రజాసేవకు అంకితం అవ్వాలని పిలుపునిచ్చిన ఎమ్మెల్యే

**కుషాయిగూడ, మహా :** కుషాయిగూడ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు బుచ్చన్నగారి శ్రీకాంత్ రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా కుషాయిగూడ శ్రీ కాటమయ్య దేవస్థానంలో నిర్వహించారు,. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకాంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు స్వీకరించారు. నాయకులు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. "ప్రజాసేవే లక్ష్యం - ప్రజలే బలం" అనే నినాదంతో ప్రజలకు మరింత చేరువై సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. జన్మదినాన్ని పురస్కరించుకుని కాప్రా సర్కిల్ పరిధిలోని నిరుపేదలు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వందలాది మందికి అన్నప్రసాదం వడ్డించి సేవాభావాన్ని చాటారు. అలాగే స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి పలువురు కార్యకర్తలు రక్తదానం చేశారు.కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు శ్రీకాంత్ రెడ్డి చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను. ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి అభినందించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జన్మదిన వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాసం మైపాల్ రెడ్డి, మెమోరీ మహేష్ గౌడ్, కనకరాజు గౌడ్, కంచకట్ల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంజినీర్లను అవమానించిన సీఎం వెంటనే రాజీనామా చేయాలి

- రాహుల్ గాంధీకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖ.

**హైదరాబాద్, మహా.** ఇంజినీర్లను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన "క్రిమినల్ వేస్ట్" వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ రాశారు.

ప్రపంచవ్యాప్తంగా భారతీయ ఇంజినీర్లు ప్రముఖ సంస్థలకు నాయకత్వం వహిస్తూ, అంతరిక్షం నుంచి అత్యాధునిక సాంకేతిక రంగాల వరకు దేశ ప్రతిష్ఠను పెంచుతున్న సమయంలో వారిని "క్రిమినల్ వేస్ట్"గా అభివర్ణించడం అత్యంత బాధ్యతారాహిత్యమని కేటీఆర్ విమర్శించారు. దేశ ప్రగతికి కీలకంగా నిలుస్తున్న లక్షలాది మంది ఇంజినీర్లను అవమానించేలా చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండించాల్సినవేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై స్పందించడం రాహుల్ గాంధీ నైతిక, రాజకీయ బాధ్యత అని కేటీఆర్ అన్నారు. ఈ విషయంలో ఆయన మౌనం పాటిస్తే, రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను సమర్థించినట్లేనని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కూడా డిమాండ్ చేశారు.

యువతే రేపటి భారత నిర్మాణ శక్తి అని గుర్తుచేసిన కేటీఆర్, యువతతో విభేదిస్తే దాని రాజకీయ పరిణామాలు ఎలా ఉంటాయో కాంగ్రెస్ చరిత్రే చెబుతుందని అన్నారు. ఎమర్జెన్సీ కాలం, తెలంగాణ ఉద్యమం వంటి సందర్భాలను ప్రస్తావిస్తూ యువత శక్తిని తక్కువ అంచనా వేయొద్దని రాహుల్ గాంధీకి సూచించారు.

ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, యువత గౌరవం గురించి మాట్లాడే కాంగ్రెస్ నాయకత్వం, తమ ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై ఎందుకు మౌనం వహిస్తోందని కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి కేవలం ఇంజినీరింగ్ విద్యార్థులనే కాకుండా ఇంజినీరింగ్ అధ్యాపకులను కూడా అవమానించేలా మాట్లాడారని ఆరోపించారు.

తెలంగాణ యువత ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ముఖ్యమంత్రి వరుసగా వ్యాఖ్యలు చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం యువత పట్ల అనుసరిస్తున్న వైఖరిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఇంజినీర్లను, విద్యార్థులను కించపరిచే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ అధికారికంగా సమర్థిస్తుందా లేదా ఖండిస్తుందా అన్న విషయాన్ని రాహుల్ గాంధీ స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఢిల్లీలో విధ్వంసానికి పాక్ కుట్ర భగ్నం!

ఢిల్లీ, మహా : పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు నెరుపుతూ దేశ రాజధానిలో భారీ విధ్వంసానికి కుట్ర పన్నిన ఒక యువ జంటను పశ్చిమ బెంగాల్ పోలీస్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) అధికారులు అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో బర్ధమాన్ వద్ద హమీమ్ మోండల్ అనే యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, ఆ తర్వాత అతడిచ్చిన సమాచారంతో జార్ఖండ్‌లోని సాహిబ్‌గంజ్ వద్ద ప్రియురాలు అర్పితా సర్కార్‌ను అరెస్ట్ చేశారు. వీరిద్దరినీ విచారించగా విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. దేశంలోని వీఐపీలను లక్ష్యంగా చేసుకుని హనీట్రాప్‌కు పాల్పడటంతో పాటు, పాక్ హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు ఢిల్లీలో అల్లర్లు సృష్టించేందుకు వీరు భారీ స్కెచ్ వేసినట్లు దర్యాప్తులో తేలింది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఇటీవల జరిగిన విద్యార్థుల నిరసన ప్రదర్శనల్లోకి చొరబడి ఘర్షణలు, గందరగోళం సృష్టించేందుకు ఈ జంట తీవ్రంగా ప్రయత్నించినట్లు ఎస్టీఎఫ్ అధికారులు గుర్తించారు. పాకిస్థాన్‌కు చెందిన హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు ఈ కుట్రకు తెరలేపారు. ఇందుకోసం రక్షక భట (పోలీస్) దుస్తులను కొనుగోలు చేసి, మహిళలు, పురుషులతో కూడిన ఒక బృందంతో ఢిల్లీకి వెళ్లాల్సిందిగా హమీమ్‌కు పాక్ ఉగ్రవాదుల నుంచి స్పష్టమైన ఆదేశాలు అందినట్లు విచారణలో వెల్లడైంది. పోలీసుల వేషంలో నిరసనకారులపై దాడి చేసి శాంతి భద్రతల సమస్యను సృష్టించి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలన్నది వీరి ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది.గత నాలుగైదు నెలల క్రితమే పాక్ ఆధారిత ఉగ్రవాద నెట్‌వర్క్ ఉచ్చులో పడిన హమీమ్.. వీఐపీలు, రాజకీయ నాయకులు, సీనియర్ పోలీస్ అధికారుల సమాచారాన్ని సేకరించడం ప్రారంభించాడు. ఈ క్రమంలోనే తనకు నాలుగేళ్లుగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం ఉన్న అర్పితను కూడా ఈ ఉగ్ర జాలంలోకి లాగాడు. రాజకీయంగా పలుకుబడి ఉన్న వ్యక్తులు, ఉన్నతాధికారులే లక్ష్యంగా ఈ జంట ఒక హనీట్రాప్ ముఠాను నడుపుతున్నట్లు ఎస్టీఎఫ్ విచారణలో స్పష్టమైంది. అర్పిత అందాన్ని ఎరగా వేసి ఏకంగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఒక సీనియర్ మంత్రి కుమారుడిని కూడా వీరు హనీట్రాప్ చేసినట్లు అధికారులు నిర్ధారించారు.

# లష్కర్ బోనమెత్తిన

( మొదటి పేజీ తరువాయి )

బోనం సమర్పించారు. అమ్మవారికి తొలి బోనాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ సమర్పించారు. ఆలయ పూజారులు సీఎం పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ క్రమంలో తలసాని శ్రీనివాస్ యాదవ్.. సీఎం రేవంత్ రెడ్డిని ఆప్యాయంగా పలుకరించిన దృశ్యాలు కనిపించాయి. మరోవైపు ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు భారీ భద్రతా ఏర్పాట్లతో పాటు అన్ని రకాల వసతులను కల్పించారు.

**జోర్దార్ జాతర**

సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి బోనాల జాతర ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారికి తెల్లవారుజామునే మహా మంగళ హారతి ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్రం ప్రభుత్వం తరఫున బంగారు బోనం, పట్టు వస్త్రాలు సమర్పించారు. పలువురు ప్రముఖులు అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. యువతులు, మహిళలు బోనాలతో, శివసత్తుల నృత్యాలతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. సీపీ సజ్జనార్ దంపతులు, సినీనటి వైష్ణవి, సినీ, రాజకీయ రంగాల ప్రముఖులు, అధికారులు అనేకమంది దర్శనం చేసుకున్నారు.







# కేకే కన్వెన్షన్ కు... అధికారిక విద్యుత్ కనెక్షన్..?

- ప్రభుత్వ ఖజానాకు కన్నం వేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు..
- టౌన్ ప్లానింగ్ అనుమతులు లేకుండానే కమర్షియల్ ట్రాన్స్ఫార్మర్..
- విద్యుత్ శాఖ అధికారులు పాత్ర పై విచారణకు డిమాండ్..
- బాధ్యులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి..



**మహా ప్రతినిధి కాకినాడ :** శంఖవరం మండలం, అన్నవరం లో ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, లొసుగులనే పెట్టుబడిగా మార్చుకుని అన్నవరంలో ఒక అక్రమ కే కే కన్వెన్షన్ కమర్షియల్ సామ్రాజ్యం వెలిసింది. నిబంధనల ప్రకారం కనీస అనుమతులు లేని ఒక తాత్కాలిక రేకుల షెడ్డుకు ఏకంగా 'కమర్షియల్ ఫంక్షన్ హాల్' అవతారమెత్తించారు. అయితే, ఏ చట్టాలు సామాన్యుడికి చుట్టుకుంటాయో.. అవే చట్టాలు ఇక్కడి నిర్వాహకులకు చుట్టాలుగా మారడం వెనుక పెద్ద కథే ఉందని స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

**.విద్యుత్ శాఖలోనే ఉంటూ.. నిబంధనలకు పంగనామాలు!**

ఈ అక్రమ కమర్షియల్ కళ్యాణ్ మండపం వెనుక సూత్రధారి, పాత్రధారి మరెవరో కాదు.. అదే అన్నవరంలో విధులు నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ లైన్మెన్ రాంబాబు అని తెలుస్తోంది. ప్రభుత్వ జీతం తీసుకుంటూ, ప్రభుత్వ సర్వీస్ రూల్స్‌ను బేఖాతరు చేస్తూ.. సదరు ఉద్యోగి ఈ ప్రైవేట్ కమర్షియల్ వ్యాపారంలో కీలక భాగస్వామిగా (Partner) గా వ్యవహరిస్తున్నారు. తనకున్న అధికార బలాన్ని, శాఖలోని లొసుగులను ఉపయోగించుకుని ఈ అక్రమ నిర్మాణానికి తెరవెనుక అన్ని తానే అయి నడిపిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రశ్నార్థకంగా మారిన కమర్షియల్ ట్రాన్స్‌ఫార్మర్' అనుమతి.**

ఇక్కడ అసలు సిసలైన ప్రశ్న ఏమిటంటే.. కనీసం ఫైర్ సేఫ్టీ (అగ్నిమాపక శాఖ) అనుమతి లేని, బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ లేని ఒక సాధారణ రేకుల షెడ్డు ఫంక్షన్ హాల్‌కు "కమర్షియల్ ట్రాన్స్‌ఫార్మర్" జగ్గంపేట డిఇ వీరభద్రరావు ఎలా మంజూరు చేశారు? అసలు నిబంధనల ప్రకారం ఉన్నతాధికారులు గ్రౌండ్ వెరిఫికేషన్ చేశారా? లేక లైన్మెన్ రాంబాబు డిపార్ట్‌మెంట్‌లోనే ఉండటంతో 'కళ్లు మూసుకుని' పర్మిషన్ ఇచ్చేశారా? ఒక కమర్షియల్ ట్రాన్స్‌ఫార్మర్ పెట్టాలంటే ఎన్నో క్లియరెన్సులు కావాలి, మరి ఇవన్నీ లేకుండానే విద్యుత్ లైన్లు ఎలా లాగారు? రేపు పొరపాటున షార్ట్ సర్క్యూట్ జరిగి వందలాది మంది ప్రాణాలకు ముప్పు వాటిల్లితే బాధ్యులు ఎవరు?

**హౌస్ టాక్స్, పంచాయతీ NOC ఆధారంగానే కనెక్షన్ ఇచ్చాం"**
**- ఏఈ ప్రసాద్**



అనుమతులు లేని రేకుల షెడ్ ఫంక్షన్ హాల్‌కు కమర్షియల్ విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంపై స్థానిక విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (AE) ప్రసాద్‌ను వివరణ కోరగా.. ఆయన విచిత్రమైన సమాధానం ఇచ్చారు. స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలోని హౌస్ టాక్స్ (ఇంటి పన్ను) రశీదు, అలాగే పంచాయతీ ఇచ్చిన నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ (NOC) ఆధారంగానే తాము కమర్షియల్ కనెక్షన్ మంజూరు చేశామని చెప్పుకొచ్చారు.




**జగ్గంపేట డీఈ వీరభద్రరావు యాక్షన్ తీసుకుంటారా?**

సొంత శాఖలోనే ఉంటూ అవినీతికి, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న లైన్మెన్ రాంబాబు వ్యవహారంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జగ్గంపేట డివిజనల్ ఇంజనీర్ (DE) వీరభద్రరావు ఈ అక్రమ కమర్షియల్ ట్రాన్స్‌ఫార్మర్ పర్మిషన్లపై తక్షణమే అంతర్గత విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ రూల్స్ ఉల్లంఘించి ప్రైవేట్ కమర్షియల్ కే కే కన్వెన్షన్ కళ్యాణ మండపం వ్యాపారం లో భాగస్వామ్యం నిర్ధారణ అయితే లైన్మెన్ రాంబాబుపై శాఖాపరమైన కఠిన చర్యలు (సస్పెన్షన్) తీసుకోవాలని, ఈ అక్రమ ఫంక్షన్ హాల్‌కు ఇచ్చిన విద్యుత్ కనెక్షన్లను పునఃపరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఉన్నతాధికారుల స్పందన కోసమే ఇప్పుడు అన్నవరం ప్రజలు ఎదురుచూస్తున్నారు.



# కుటుంబ కలహాలతో గృహిణి మృతి

**పీఎస్ లో ఫిర్యాదు చేసిన కుటుంబ సభ్యులు**

**కుషాయిగూడ, మహా :** కుటుంబ కలహాలతో ఓ గృహిణి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ ఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్ ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం... యాప్రాల్ ప్రాంతం లో బి. బాలరాజు భార్య లలిత ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. బాలరాజు ఇండియన్ ఆర్మీలో పనిచేస్తున్నాడు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు చోటు చేసుకుంటున్నాయి. మూడు నెలల క్రితం లలిత( 28) ను భర్త కొట్టడంతో నాగర్ కర్నూల్ జిల్లా కేశంపేట తండా అయిన పుట్టింటికి వెళ్ళింది. మూడు రోజుల క్రితం బాలరాజు వద్దకు లలితను తన అన్నబాధ్య తీసుకువచ్చాడు. కోపంతో రగిలిపోయిన బాలరాజు భార్య లలిత బామ్మర్ది బాధ్య ను కొట్టాడు. ఈనెల 1వ తేదీన భార్య లలిత వాటర్ హీటర్ బకెట్లో చేతిని పెట్టుకుందని స్థానికులు బాలరాజుకు సమాచారం అందించారు. వెంటనే లలితను ఆర్మీ దావకానాకు తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. హీటర్ బకెట్ కు సంబంధించిన ఘటన భర్త బాలరాజు వేధింపులతోనే లలిత మరణించి ఉంటుందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులు లలిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఆటోమొబైల్ రంగంలో నవశకం

- వికసిత భారత్ దిశగా మరో మైలురాయి.
- ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలకు బలమైన అడుగు.
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి




**హైదరాబాద్, మహా :** భారత ఆటోమొబైల్ రంగం మరో కీలక మైలురాయిని చేరుకుంది. స్వదేశీ సాంకేతికతతో కేటో మోటార్స్ రూపొందించిన తొలి కమర్షియల్ ఎలక్ట్రిక్ బస్సును కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఘనంగా ఆవిష్కరించారు. దేశంలో పెరుగుతున్న పట్టణ రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన 9 మీటర్ల ఆధునిక ఎలక్ట్రిక్ బస్సును ఆపరేటింగ్ భాగస్వామికి అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ యాజమాన్యం, ఇంజనీర్లు, ఉద్యోగులను మంత్రి అభినందించారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో తయారీ, హరిత ఇంధనం, సాంకేతికత, ఆవిష్కరణల రంగాల్లో భారత్ వేగంగా పురోగమిస్తోందని కిషన్ రెడ్డి అన్నారు. ఈ ఎలక్ట్రిక్ బస్సు స్వదేశీ తయారీ సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.

**ఆత్మనిర్భర్ భారత్‌కు మరో బలమైన అడుగు**

ఒకప్పుడు వ్యాక్సిన్ల కోసం విదేశాలపై ఆధారపడిన భారత్, కోవిడ్ సమయంలో స్వదేశీ వ్యాక్సిన్లను అభివృద్ధి చేసి ప్రపంచ దేశాలకు సరఫరా చేసిన ఘనత సాధించిందని మంత్రి గుర్తుచేశారు. అదే ఆత్మనిర్భరత ఇప్పుడు ఆటోమొబైల్ రంగంలోనూ స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాలు కేవలం ప్రత్యామ్నాయ రవాణా సాధనాలు మాత్రమే కాకుండా, దేశ ఇంధన భద్రత, కాలుష్య నియంత్రణ, ముడి చమురు దిగుమతుల తగ్గింపులో కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. బ్యాటరీ తయారీ, ఛార్జింగ్ మౌలిక వసతులు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి వంటి అన్ని రంగాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని చెప్పారు.

**హరిత ఇంధన విప్లవం వైపు దేశం**

స్వచ్ఛమైన విద్యుత్ ఉత్పత్తి కోసం కేంద్ర ప్రభుత్వం సోలార్, విండ్, హైడ్రో, గ్రీన్ ఎనర్జీ కారిడార్లలో భారీ పెట్టుబడులు పెడుతోందని మంత్రి తెలిపారు. కోల్ ఇండియా, నేవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు కూడా పునరుత్పాదక ఇంధన రంగంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు.

భవిష్యత్ సాంకేతికతకు అత్యంత అవసరమైన లిథియం, కోబాల్ట్, నికెల్, కాపర్ వంటి కీలక ఖనిజాల భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం రూ.34 వేల కోట్లతో నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ అమలు చేస్తోందని వెల్లడించారు.

**టెక్నాలజీ హబ్‌గా తెలంగాణ**

ఐటీ, ఫార్మా, డిఫెన్స్ రంగాలతో పాటు ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ డిజైన్ రంగాల్లో తెలంగాణ దేశంలో ముందంజలో ఉందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో అంతర్జాతీయ సెమీకండక్టర్ సంస్థలు పెట్టుబడులు పెట్టడం, తెలుగు యువ ఇంజనీర్లు ప్రపంచ స్థాయి చిప్‌ల రూపకల్పనలో భాగస్వాములు కావడం గర్వకారణమన్నారు.

సెమికాన్ ఇండియా ప్రోగ్రామ్, పీఎల్ఐ పథకాలతో ఎలక్ట్రానిక్స్ తయారీ ఏడు రెట్లు, ఎగుమతులు పదకొండు రెట్లు పెరిగాయని తెలిపారు. ఈ రంగాల ద్వారా సుమారు 25 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని వెల్లడించారు.

**వికసిత భారత్ 2047 లక్ష్యానికి మరో ముందడుగు**

అభివృద్ధి చెందిన మౌలిక వసతులు, వేగవంతమైన పారిశ్రామికీకరణ, స్వదేశీ సాంకేతికతతో భారత్ "వికసిత భారత్2047" లక్ష్య దిశగా దూసుకుపోతోందని మంత్రి అన్నారు. కేటో మోటార్స్ రూపొందించిన కమర్షియల్ ఎలక్ట్రిక్ బస్సు దేశీయ సాంకేతిక ప్రతిభకు ప్రతీకగా నిలుస్తుందని, భవిష్యత్తులో మరిన్ని ఆవిష్కరణలతో పర్యావరణహిత రవాణా వ్యవస్థ అభివృద్ధికి సంస్థ కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

మహా పత్రిక
తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 03-08-2026



# ఉడుకుడుకు

ఇళ్లలోపల చదువుల కన్నీళ్ల చప్పుడు
పెకిలినప్పుడే మీరు వినాల్సింది వినలేదు
అది వాకిట్లోకి పాకి నలుగురిలో
గొల్లుమన్నప్పుడైనా వినాల్సింది వినలేదు
ఇప్పుడది
నగరవీధుల్లోకి వేల గొంతుకలతో ఉడుకూ ఉరవడితో
దూసుకొచ్చి హోరెత్తుతున్నది
అనర్గళంగా మనసు మాటగా ఆవేశభాషణాలే అలవా
టైన ఏకపక్ష కాలంలో
మా మాట వినమని పచ్చి గొంతుకల యువ
సమూహం గర్జిస్తున్నది ఎదురొచ్చి.

ఇప్పుడైనా వినాలి కదా
వినడమెందుకని బలగాల బలదర్పంతో
కాళ్ళనూ చేతులనూ తరమొచ్చు గానీ
గాలితో మమేకమవుతున్న గొంతులనెలా తరుము
తారు
గాలిని నియంత్రించలేరు దానిలో లీనమవుతున్న
స్వరాలను కూడా .

ప్రజల దేశంలో ప్రజలను వినడం సత్సంప్రదాయం
మాత్రమేనా , విధి కూడా.
బిడ్డల మనసును మంచి తండ్రి విన్నట్టు
వినాలి కదా
వింటే కదా తెలిసేది తకరారు ఏమిటో తప్పిదమేమిటో
తగిన దిద్దుబాటులేమిటో

వినండి
నినదిస్తున్నది ఎవరో పరాయి వాళ్లు కాదు
మన పిల్లలే.
ఇవాళ వీధులను పట్టించుకోకుంటే
రేపు ఇళ్లను బతికించుకోలేం.

వినండి.
(24.7.2026)

**దర్భశయనం శ్రీనివాసాచార్య**
**94404 19039**

# కథలన్నీ ఎలా మోశానో మీకేమి తెలుసు !

చందమామ అందకపోవచ్చు
ఆకాశం దాకా చూపైతే వెళుతుంది
వెన్నెల జేబులో నిండక పోవచ్చు
కనిపించే మూలదాకా పరుచుకుంటుంది
ఈ రాత్రి రాక్షసిలా, నాకు కాపలా కాస్తుంది
జడలు తగలబడే దాకా నిరీక్షిస్తాను

అర్హతను బట్టి బాధ్యతలు మీదపడవు
పరిస్థితులు స్వీకరించే ధైర్యానిస్తాయి
కొంత బరువు మోయ గలుగుతాం
కొంత ఓపిక నేర్వ గలుగుతాం

చౌరస్తాలో పాములోడి పాములైతే,
మాట అర్థమైనట్టే వినయంగా ఆడుతాయి
ఆట చూసిన మనుషుల్లో, యే మార్పురాదు
పడగవిప్పి బుసకొడుతూ భయపెడుతారు

చీకట్లను కళ్లల్లో మూసేయొచ్చు
ఒక్క తారను కూడా కప్పేయడం సాధ్యంకాదు

నడిచి పోతున్నది, గడిచి పోతున్నది సమయం కాదు
తరిగి పోతున్నది, జారి పోతున్నది జీవితం

ఈ కథలన్నీ ఎలా మోశానో మీకేమి తెలుసు
మీ జీవితం కథ కాలేదు, అందుకు సంతోషించండి
కొందరికి దొరికిన దినం, అవసరమని పించదు
అవసరమనిపించే వాళ్లకు రాత్రే కదలదు

మనసు మీది అడుగులు, కళ్లల్లోని జ్ఞాపకాలు
జోరుగా కురిసిన వర్షం లాంటివి
జల్లులయితే జాడించి వెళ్లిపోతాయి
కిటికీ చూపులు, తడి తడిగానే వుంటాయి

**ఆశారాజు**
**9392302245**

# నది చెప్పిన మానవ నైజాలు

నది మానవ నాగరికతకు సంకేతం. మనిషి నిరంతర జీవన సంఘర్షణకూ అది సాక్షీభూతం. యుగయుగాల జీవనవేదనల్ని, చరిత్ర రక్తపు చారికల్నీ అది తనలో నింపుకుంటుంది. స్వార్థపు దాహంతో మనిషి తన ఉనికికి ఎన్నెన్ని తూట్లు పొడుస్తున్నా అది నిస్వార్థంగా అతడి దాహాన్ని తీరుస్తూనే వుంటుంది. అందుకే నది సాహిత్యానికి మాధ్యమమైపోయింది. సాహిత్యం నదికి మానవీకరణ చేసి దాని పలుకులతో మనిషికి దిశానిర్దేశం చేస్తుంది. తన తీరాల వెంబడి సేదదీరే అట్టడుగు వర్గాల సంక్షుభిత జీవననాదాలతో పాటు మనిషి తనలోకి వొంపుతున్న సంక్షోభఘోషల్నీ అది వినిపిస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా వెలువడ్డాయి డాక్టర్ వి. ఆర్. రాసాని 'స్వర్ణముఖి కథలు'.

తెలుగు సాహిత్యంలో ప్రకృతి మానవీకరణ అనే ప్రక్రియ శిల్పనైపుణ్య పద్ధతిలో సాగింది. పసిపిల్లల్లో పఠనాశక్తిని పెంచే దిశగా బాలసాహిత్యంలో ప్రకృతి మానవీకరణ ప్రధానంగా చోటుచేసుకున్నదని చెప్పవచ్చు. ఈ పద్ధతిలో ఎన్నో కథలు వెలువడ్డాయి. తెలుగులో ప్రాచీన సాహిత్యంనుంచే అంటే ప్రబంధయుగంనుంచే ప్రకృతి మానవీకరణ పద్ధతి కనిపిస్తుంది. తన 'వసుచరిత్ర'లో రామరాజభూషణుడు చేసిన ప్రయోగమే ఇందుకు ప్రబల ఉదాహరణ. ఇందులో కవి నది, పర్వతాలను మానవీకరణ చేసి వాటికి మానవావస్థల్నీ ఆపాదించాడు. నది రూపంలో వుండే శుక్తిమతి, పర్వతం రూపంలో వుండే కోలాహలుల ప్రేమగాథ ఇందులో కనిపిస్తుంది. ఆ ప్రకృతిలో భాగమైన నదీతీరాల్లోని జనజీవితాల్ని ఆవిష్కరించిన కథలూ తెలుగులో ఎన్నో చోటుచేసుకున్నాయి. శంకరమంచి పార్థసారథి 'అమరావతి కథలు'లో కష్ణానది తీరం వెంబడి జీవనం సాగించే మనుషుల చిత్తప్రవృత్తులు కనిపిస్తే, పి. రామకృష్ణారెడ్డి 'పెన్నేటికతలు' పెన్నేటి ఒడ్డున భారంగా బ్రతుకులీడ్చే జనజీవితాల వెతల్ని వినిపిస్తాయి. దర్శకుడు వంశీ 'మా దిగువ గోదారి కథలు'లో తన నోస్టాల్జియా జ్ఞాపకాలను గోదావరితో పెనవేసుకున్న మనుషుల ముచ్చట్లతో అనుసంధానిస్తాడు. సా.వెం. రమేష్ 'ప్రళయకావేరి కథలు' ప్రళయకావేరి సరస్సులో చిన్నదీవుల్లాంటి ప్రదేశాల్లో తిరిగాడిన జనజీవితాల ఇరుకు బ్రతుకుల్ని ఆవిష్కరించాయి. ఉప్పరపాటి వెంకటేశ్వర్లు 'చిత్రావతి కథలు' చిత్రావతి తీరప్రాంతంలో ఉసూరుమంటూ జీవించే మనుషుల కరువు వేదనల్ని వినిపిస్తాయి.

ఇప్పుడు వి. ఆర్. రాసాని 'స్వర్ణముఖి కథలు'లో స్వయంగా స్వర్ణముఖి నదే మాధ్యమమై తన ఒడిలో సేదదీరే జనజీవితాల గాథల్ని చెబుతుంది. అక్కడి అట్టడుగు వర్గాల గోడును తన గోడుగా చెప్పుకుంటుంది. ఆ గోడు వెనుక అనంతమైన జీవన సంఘర్షణ, అంతులేని మనిషి స్వార్థపు ఆనవాళ్లు కనిపిస్తాయి. ఈ కథల్ని చదువుతుంటే ఆధునిక సామాజిక సమస్యలు స్ఫురింపజేస్తూనే 'అద్భుత వాస్తవికత పద్ధతి(మేజిక్ రియలిజమ్)' లో జానపదశైలిలో సాగే చందమామ కథలు చదువుతున్న అనుభూతి కలుగుతుంది. స్వర్ణముఖి నది తిరుపతి జిల్లా పాకాల దగ్గర తూర్పు కనుమల్లో ఉద్భవించి దాదాపు 130 కిలోమీటర్లు ప్రయాణించి నెల్లూరు జిల్లా వాకాడు మండలంలోని పామంజి గ్రామ సమీపంలో బంగాళాఖాతంలో కలుస్తుంది. ఈ మధ్యలో తిరుపతి, నెల్లూరు జిల్లాల్లోని ఈ నదీపరీవాహకప్రాంతాల్లో నివసించే అట్టడుగు వర్గాల వేదనలు, సంపన్నవర్గాల పటాటోపాలు, అక్కడి మనుషుల




చిత్రవిచిత్ర మనస్తత్వాలు, వారి అత్యాశల్లో చిక్కుకొని వెలవెలబోయే నదీమ తల్లి దుఃఖపు పొరలు ఈ కథల్లో కనిపిస్తాయి. వీటిలో కొన్ని కథలు పర్యావరణ స్పృహను కలిగిస్తే, మరి కొన్ని కథలు ఆ ప్రాంతాల సంస్కృతుల్ని, సంప్రదాయాల్ని ప్రతిబింబిస్తాయి. తిరుపతి ప్రాంతపు మాండలికపు సొబగుల్ని సంతరించుకున్న ఈ సంపుటిలోని 20 కథలూ మానవ మనస్తత్వాల్లోని విభిన్న పార్శ్వాలను ఆవిష్కరించాయి. ఇందులోని మొదటి కథలో స్వర్ణముఖి భౌగోళిక స్వరూపాన్ని పర్యావరణానికి ప్రతీక అయిన గరుడపక్షి, స్వర్ణముఖి సంభాషణల ద్వారా ముదిగారంగా వివరించే రచయిత శైలి చివరి కథ వరకూ అలాగే సాగుతుంది. ఆ ప్రాంతాల్లో ఒకప్పటి జనజీవితాల్లో మెలగుతూ ఆ జీవితాల్ని ప్రభావితం చేసే కొన్ని వాస్తవిక పాత్రల్ని వాస్తవిక సంఘటనలతో రచయిత ఇందులో ప్రవేశపెట్టాడు. దెయ్యాలను తరిమివేసే మంత్రాల మొనగాడుగా ప్రజలను నమ్మించి చివరికి తన గుట్టు రట్టై వారికే దొరికిపోయే మునసామి, అప్పలాయగుంటలో నాటకాలేసే కంగుంది కళాకారుల ఆదరాభిమానాలను చూరగొని వారికి సాయం చేస్తూ వారిచేత నీరాజనాలర్పించుకునే కళాభిమాని, రైతుకూలీ ఉత్తన్న, ఏటిలో ఇసుక తోడడంలో దారి చూపించే రైతు సుబ్బన్ననే తమకు పోటీదారునిగా భావించి అతనిని అంతమొందించే ఇసుకాసురులైన రాజకీయనేతలు, శనీశ్వరాలయాలను మళ్లీమళ్లీ నిర్మించుకొని అక్కడి భక్తులను వారి నమ్మకాలతో క్యాష్ చేసుకునే పూజారి వెంకటశాస్త్రి, తమ మొక్కులు చెల్లించుకోవడంలో భాగంగా పేదరైతులు తమ కోడెదూడల్ని ఆలయానికి వదలివేస్తే వాటిని కసాయివాళ్లకు అమ్ముకునే అక్కడి పూజారులు... వీళ్లంతా ఈ కథల్లోని పాత్రలు.

ఈ కథల్లో రచయిత తన శిల్పనైపుణ్యం ద్వారా స్వర్ణముఖి, గరుడుడి సంభాషణల ద్వారానే అనేక సంఘటనల్ని, సందర్భాల్ని మన కళ్లముందుంచుతాడు. పర్యావరణానికి తూట్లుపొడిచే పలు సమస్యలకు కథనరూపమిస్తాడు. 'ఇసకాసురులు' కథలో తన వొంటిమీద వున్న గాట్లను ప్రశ్నించిన గరుడుడికి స్వర్ణమ్మ ఇలా సమాధానమిస్తుంది... 'యేంజేసేదిరా!... నేను నదిని గదా! నాలో వుండే ఇసకను తోడి తోడి లారీలకు, ట్రాక్టర్లకు ఎక్కించి యీ మనుషులు యాపారాలు మొదలుపెట్రి. జేసీబీలతో ఆ ఇసక తోడినప్పుడు పడిన గాట్లురా ఇవి'... ఇక్కడ రచయిత నదిని మానవీకరణ చేయడమే కాకుండా ఆ మానవీకరణకు మానవ అవస్థీకరణను కూడా ఆపాదించడమే శిల్పనైపుణ్యం. ఈ సంపుటికే హైలైట్ అనదగ్గ 'చెట్టుతల్లి' కథలో తనను పలువిధాలుగా ఆదుకున్న వేపచెట్టునే సర్వస్వంగా భావించి దానికి పూజలు చేసే మల్లక్క ఒక రాజకీయనేత ఆక్రమణ దురహంకారానికి ఆ చెట్టు నేలమట్టమైనప్పుడు 'అయ్యో నానేల! అయ్యో నా యాపసెట్టు! ప్రపంచకానికి గాలినిచ్చే యాపసెట్టు, రోగాలను తరిమికొట్టే నా యాపసెట్టు, కన్నతల్లి మాదిర్తో నీడనిచ్చే నా యాపసెట్టు,,, అంటూ బోరుమని రోదించే వైనం హృదయాలను ద్రవింపజేస్తుంది. మనుషులు అత్యాశతో భవంతుల కోసం గోతులు మీద గోతులు తవ్వితే పునాదులు కదిలిపోయి శ్రీకాళహస్తిలోని గాలిగోపురం కూలిపోవడం, ఆస్తులన్నీ కోల్పోయి కటిక దారిద్ర్యంతో శ్రీకాళహస్తి జమీందారీ కుటుంబం సామూహిక ఆత్మహత్యకు పాల్పడడం, శ్రీనివాసమంగాపురంలో అమ్మవారికి వి.ఎ.కె. రంగారావు నృత్యనీరాజనాలర్పించడం వంటి చారిత్రక సంఘటనలూ ఈ కథల్లో చోటుచేసుకున్నాయి. స్వర్ణముఖి నది ఎక్కువభాగం దేవాలయాల పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రవహించడం వల్ల తాత్వికచింతనతో సాగే 'పలకపిలగోడి జన్మరహస్యం' అనే కథలో దొంగలనుంచి రక్షణ కోసం దప్పులు కొడుతూ ప్రజల్ని మేల్కొల్పడానికి రాజు తన నగరంలో నియమించే పలకపిలగోడి ద్వారా రాజులోనూ, దొంగల్లోనూ మానసిక పరివర్తన తీసుకరావడం ఆ ఆధ్యాత్మిక వాతావరణాన్ని తెలియజేస్తుంది.

'గెవిని దేవరకత'లో కరువుకాటకాలు పోవాలని విరిగిపోయిన రాళ్లు, రుబ్బురోళ్లు వంటివాటిని ఎద్దుల బండ్ల ద్వారా ఊరు సరిహద్దును దాటించి ప్రజలు చేసుకునే గెవినిదేవర తంతునూ, 'ఏడు గంగమ్మల జాతర' కథలో బాల్యవివాహాలతో, బసివిని ముద్రలతో శ్రీకాళహస్తిలో జరిగే ఏడుగంగమ్మల జాతర తంతునూ పూర్తిగా రచయిత కళ్లకుకట్టినట్టు వర్ణించడం ఆ సంస్కృతుల పట్ల రచయితకు గల సంపూర్ణ అవగాహనను తెలియజేస్తుంది. 'స్వర్ణమ్మ నెత్తుటి ముఖం' కథలో మర్రిచెట్టు కింది నమ్మకాలతో మిళితమైన సత్తిరాయిని ఒక రాజకీయనేత కబ్జాపేరుతో తీసివేస్తుంటే దానిని అడ్డుకొంటూ ప్రజలు తలలు పగలేలా ఘర్షణపడడం, అక్కడ చిందే రక్తం స్వర్ణమ్మ ముఖానికి తగలడం ఆ ప్రజల్ని వీడని మూఢనమ్మకాల దాహాన్ని తెలియజేస్తుంది. ఫ్యాక్టరీలు పెరిగిపోయి, కాలుష్యం ఆవహించి కుచించుకుపోయే స్వర్ణముఖి వేదనను తెలియజేస్తుంది 'వృర్థముఖి అయిపోతావుండే స్వర్ణముఖి' కథ. నగరంలో ఆక్రమణలు ఎక్కువైపోయినందుకు పర్యవసానంగా వానలు ఉధృతంగా కురిస్తే తిరుపతిలోని కళ్యాణి డ్యామ్ గేట్లు తెగిపోయి ఉప్పెంగే స్వర్ణముఖి ఊరును ఎలా ముంపునకు గురిచేస్తుందో వివరిస్తుంది 'సొర్ణమ్మ యిశ్వరూపం' కథ. బాంబు శబ్దాలతో రాళ్లు పగిలిపోతూ, కొండలు తరిగిపోతూ పెరిగిపోయే క్వారీలతో జరిగే అనర్థాల్ని తెలియజేస్తుంది 'గరుడుడి గతీ అట్లయిపాయే' కథ. ఆ క్వారీలకు బలయ్యే గరుడుడి మరణంతో విషాదంతో ముగుస్తాయి ఈ కథలు. స్వర్ణముఖి నది ఒడిలో సేదదీరే ఏన్నో జీవితాల బాధామయ గాథలివి. మనిషి అత్యాశల కోరల్లో చిక్కుకొని కలావిహీనమైపోతున్న ఆ నదీమతల్లి కన్నీటి ఘోషలివి.

**స్వర్ణముఖి కథలు**
**రచన: డాక్టర్ వి. ఆర్. రాసాని**
**పేజీలు: 141, వెల: రూ. 175**
**ప్రచురణ: బాలాబుక్స్**
**ప్రతులకు:**
**ఉషాప్రత్యూష**
**మొబైల్ 9908091509**



**డాక్టర్ కొత్వాలు అమరేంద్ర,**
**9177732414**

# నాన్నల ప్రేరణాత్మక కథలు

వ్యక్తి తన లోపలి శక్తిని, సృజనను మేల్కొల్పడానికి బయటి నుండి ప్రేరణ ఇవ్వగలిగే ఒక అద్భుతమైన అనుభవాన్ని పొందగలగాలి . అలాంటి అనుభవ సాధనం ఒక అద్భుతమైన చిత్రకారుడు కావచ్చు , ఒక క్రీడాకారుడు, ఒక రచన, ఒక వ్యక్తి సాధించిన విజయం కావచ్చు లేదా తనకు మార్గదర్శియై విజయ పథం పై నడిపించగలిగే ఒక చేయూత కావచ్చు. పసితనం నుండే పిల్లవాడు తనకు భద్రతగా తల్లి ఒడిని ఆశ్రయిస్తాడు . పెరుగుతున్న కొద్దీ సమాజం నుండి భద్రతను తండ్రి నుండి ఆశించడం మొదలు పెడ్తాడు. ఏ పసివాడికైనాఎదిగే క్రమంలో వ్యక్తి నిర్మాణం, వ్యక్తిత్వ వికాసం తల్లిదండ్రుల పెంపకం, వారి సంస్కారవంతమైన, క్రమశిక్షణతో కూడిన జీవన శైలి ప్రేరణదాయకమై దిశానిర్దేశం చేస్తుంది . సమాజంలోని దుష్ప్రభావాలనుండి కూడా దూరం ఉంచవలసిన నైతిక బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుంది. అందుకే స్వచ్ఛమైన సమాజ నిర్మాణానికి తల్లిదండ్రుల బాధ్యత అత్యంత ప్రధానమైనది, దాని ఫలితాన్ని పిల్లలు సాధించిన విజయాలు అద్దం పడతాయి. ఆ విజయాలు గొప్పగా వుండవలసిన అవసరంలేదు . అందుకు ఉదాహరణగా దిగువ మధ్య తరగతి కుటుంబానికి చెందిన బీహార్ లోని సరం జిల్లా కేంద్రంలో పిండి మిల్లు నడుపుకుంటున్న రాజ్ కుమార్ సింగ్ ఏడుగురు కుమార్తెల వైపు చూడవచ్చు. సాధారణ పోలీసు ఉద్యోగాలు సాధించి ఒక సామాజిక బాధ్యతను తమ భుజాలపై మోసుకోవడమే పెద్ద ఘనత, వారి విజయాలకు కారణభూతమైన తండ్రి అందించిన ప్రేరణ, మనోబలం, చేయూత ఇందుకు సాక్ష్యం.

ఇంతకు ముందు పిల్లలపై తల్లి ప్రభావాన్ని వివరిస్తూ "అమ్మ చెక్కిన శిల్పం", ఇప్పుడు తండ్రిని ఆదర్శంగా తీసుకొని విజయపథంలో ఎగిసిన సంతానాన్ని "'నాన్న చెక్కిన శిల్పం' గా ప్రదర్శించారు జాలాది రత్నసుధీర్. నాన్నల ప్రేరణతో పిల్లలు సాధించిన విజయాలను రికార్డ్ చేశారు సుధీర్. తాత్వికులు వ్యాఖ్యానించినట్లు నిరాకారమైన శిలలో ఒక రూపం దాగి వుంటుంది, మనకు నచ్చిన రూపాన్ని వెలికి తీయాలంటే దానికి తగురీతిలో అనవసరమనుకున్నవాటిని తొలిగిస్తూ పోవడమే శిల్పి చేసే గొప్ప పని . నాన్నలు అలా తమ పిల్లలలో వున్న బలహీనతలను తొలిగించి, మనోధైర్యాన్ని కలిగించి వారికి నచ్చే విధంగా, సమాజం మెచ్చే విధంగా చెక్కడంలోనే నాన్నల శిల్పితనం కనబడుతుంది. అబ్దుల్ కలాం గారి తండ్రి జైనులబ్దిన్ ఆత్మీయ జీవితం, దైవభక్తి, జీవనశైలి కలాం నడతపై తీవ్ర ప్రభావం చూపింది . కలాంకు అలవడిన




క్రమశిక్షణ , మానవీయత, ఉదాత్త లక్షణాలు తండ్రి నుండి సంక్రమించినవే . ఉన్నత స్థానాలకెదిగి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మహనీయులు అలెగ్జాండర్, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ , సుభాష్ చంద్ర బోస్, ఇందిరా గాంధీ , విక్రమ్ సారాబాయ్ , అనురాధ కొయిరాలా లాంటివారు వారి జీవితాలలో తండ్రుల ప్రభావం అధికం . అలాగే రాజేశ్వరి, చోటా.కె. నాయుడు, రోష్ని, లియాండర్ పేస్, వరప్రసాద్ రెడ్డి, జాలాది రాజారావు, ఇంకా పుస్తకంలో ప్రస్తావించిన ఇతరులకు వారి నాన్నలే ప్రేరణ. ఇలా విజయపథంలో ముందుకు సాగిన వారికి కేవలం వారి నాన్నల ప్రేరణ మాత్రమే గాక స్వయంగా వారిలో నిక్షిప్తమైన లక్ష్యాలను చేరుకోవాలనే పట్టుదల, నిబద్ధత , తీవ్రమైన ఆకాంక్షలు కూడా ముఖ్యమని మనం గుర్తించాలి. "ఈ పుస్తకం రాయటంలో నా ప్రతిభగాని, సృజనాత్మకత గాని ఏమీలేవు, కేవలం విషయ సేకరణ మాత్రమే" అని తన మాటల్లో స్పందిస్తూ గూగుల్, వికీపీడియాలో నుండి ఈ విషయ సేకరణ చేసినట్లు చెప్పుకున్న రచయిత జాలాది రత్న సుధీర్ నిజాయితి, చిత్తశుద్ధి వారి సంతానానికే కాదు సమాజానికి కూడా ఆదర్శవంతమైనది . ముప్పై రెండు మంది ప్రముఖుల జీవితాలపై వారి నాన్నల ప్రభావం ఎలా వుందో, వారినుండి ఎలా ప్రేరణ పొందాలో విషయాన్వేషణ చేసి యువతరానికి అందించిన సుధీర్ ప్రయత్నం అభినందించదగినది . రత్న సుధీర్ రచనలు వ్యక్తిత్వ వికాసాన్ని కలిగించేవిగా గాకుండానే ప్రేరణాత్మకమైనా మూలకాలను కూడా అందిస్తాయి. ఆ దిశగా వచ్చిన మరో రచనే "నాన్న చెక్కిన శిల్పం."

**'నాన్న చెక్కిన శిల్పం' (వ్యాస సంపుటి ): జాలాది రత్న సుధీర్, వెల :150/ రూపాయలు , పేజీలు:126, ప్రతులకు : H. No. 83329/16/ W, 501, Road no. 10C, సాయికృష్ణ టవర్స్ , హైలెం కాలనీ , జూబ్లీ హిల్స్, హైదరాబాద్ 500045, Mob. no. 98494 18009**



**డా. రూప్ కుమార్ డబ్బీకార్**
**Mob.no: 91778 57389**

# "పరావలయం" కవిత్వసంపుటితాత్వికదృక్పథం

తెలుగుసాహిత్యంలో కవిత్వం రాయకుండా ఉండలేని స్థితిలోంచి గాఢమైన కవిత్వం రాసే కొద్దిమంది సమకాలీన కవుల్లో ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్ ఒకరు. కవిత్వంలో రాసికంటే వాసికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే సున్నితమైన మనసున్న ప్రవీణ్ సమాజాన్ని, మనుషుల సవేదనల్ని కవిత్వంగా మలిచే మానవతావాదకవి. 2014 లో తన మొదటి కవిత్వసంపుటి "దుఖానంతర దృశ్యం" తో కవిత్వ ప్రపంచంలోకి అడుగుపెట్టి ఆ సంపుటికే అత్యంత ప్రతిష్టాత్మకమైన రంగినేని ఎల్లమ్మ పురస్కారం పొందడం ఆయన కవిత్వసృజనకు గీటురాయి. ప్రవీణ్ కవిత్వాన్ని సునిశితంగా పరిశీలిస్తే! ఆయన ఎన్నుకునే వస్తువు గాని, ఆ వస్తువును కవిత్వం చేసే పద్ధతి గాని కవితాత్మకంగా ఉండి చదివే పాఠకున్ని లోతుగా ఆలోచింపచేస్తాడు. అతి తక్కువ పదాల్లో ఎక్కువ భావాన్ని నింపి పొదుపుగా పదాల్ని వాడుతూ కవితను నడిపించే తీరు మనల్నిఅబ్బురపరుస్తుంది. వస్తుపరంగానే కాక, భావ, శిల్పపరంగా కూడా కలంతో కవితను చెక్కే చేయి తిరిగిన కవనశిల్పాచార్యుడు.

ఏ కవైనా తను రాసిన ప్రతి కవితను లోతుగా పరిశీలించుకొని, introspect చేసుకుంటూ ఎడిట్ చేసుకొని ప్రచురణకు పంపాలి కానీ రాసిన ప్రతి కవితను ప్రచురణకు పంపకూడదు. అలా తను రాసింది కవిత్వమా కాదా?అని అనుశీలించుకుంటూ...పరీక్షించుకుంటూ..పాఠకుల ముందుకు పోతానంటూ.. అక్షరాలకు రంగు, రుచి, వాసన ఉంటాయని అజంతాలా నమ్ముతానంటాడు ప్రవీణ్. ఆయన రాసే ప్రతి కవిత చిక్కగా రాస్తాడు కాబట్టే తక్కువ రాసినా ఎక్కువ పేరొచ్చింది. కవిత్వం రాయడం ఒక అభిరుచి కాదు, అదొక సామాజిక బాధ్యత అంటాడు ప్రవీణ్. అంత commitment తో కవిత్వం రాసే ప్రవీణ్ ఒక బలమైన కవే కాక, మంచి కవిత్వ కార్యకర్త కూడా. యువకవులతో పాటు ఎంతోమంది సీనియర్ కవులతో మంచి స్నేహసంబంధాలు ఉన్న ప్రవీణ్ ఎన్నో సాహిత్య సంస్థల్లో క్రియాశీలకంగా పనిచేస్తూ మంచి ఆర్గనైజర్ గా పేరుతెచ్చుకున్నాడు.

తన రెండవ కవిత్వసంపుటి "పరావలయం" కవిత్వం పరిశీలిస్తే! అందులో ముఖ్యంగా మనిషికి మనిషికి మధ్య అనుబంధం తెగిపోతుందని వాపోతాడు. చెవులుండి వినలేని.. గొంతుండి మాట్లాడలేని.. సమూహంలో ఒంటరైన ఆధునిక మనిషి సమూహంలో ఏకాకి అయిన వైనాన్ని చూసి బాధపడతాడు. పువ్వులనిండా కులాల రంగులనద్ది మట్టికి కూడా మతాల రంగు పులుముతున్నారని మండిపోతాడు.

"మౌఢ్యం" అనే కవితలో..కాలం పెట్టె పరీక్షలకు చెదిరిపోతూ తన నీడను చూసి తానే బెదిరిపోయే ఈనాటి ఆధునిక మానవుడు క్షణక్షణం అభద్రతా భావంలో జీవిస్తున్నాడంటూ..జీవితాన్నినాలుగు గోడల మధ్య ఎంత రహస్యంగా దాచినా అదొక బహిరంగ ముచ్చటేనంటాడు.అందుకే జీవితమెప్పటికీ రంగు రంగుల వర్ణచిత్రం కాదు..ఇంద్రధనస్సు అసలే కాదు..జీవితం నిత్యం ప్రపంచానికి వెలుగులుపంచే ఏకవర్ణ సూర్యుడంటాడు. "జాగ్రత్త" లో..తెలంగాణ ప్రజల ఉక్రోశాన్నీ, ఆవేదనను వాళ్ళ యొక్క సాహస ప్రవృత్తిని పోరాటం చేసే తెగువను ఈ క్రింది విధంగా అక్షరబద్ధం చేస్తాడు.

మేము నిప్పుల మీద నడిచిన నికార్సైన వాళ్ళం
ఆకలితో అలమటించి అల్సర్లతో బాధపడ్డవాళ్లం
మాటకోసం తల తాకట్టు పెట్టినవాళ్లం
మట్టికొసం మరణాన్ని ముద్దాడినవాళ్లం.. అంటూ తెలంగాణను తేనెలా జుర్రుకున్నవాళ్లను ఎండకడతాడు.




ఆధునిక సమాజమంతా యాంత్రికంగా తయారై, వ్యవస్థంతా చిన్నాభిన్నమై అవకాశాల లేమితో ప్రతిరోజు సంఘర్షణ.. ప్రతిక్షణం పోరాటం.. ఎంత ఎదురుచూసినా రాని వేకువ కోసం ఎదురుచూస్తూ, విజయం కోసం తపించి డస్సిపోయి....దుఖంలేని చోటుకోసం వెతుక్కుంటూ..మరణం లేని రోజు కోసం నిరీక్షిస్తున్నానంటూ జీవితానికి భరోసానిస్తూ..నిరాశతో బతుకునీడ్చేవాళ్లకొక ఆశావాహ దృక్పధాన్ని అందిస్తాడు.

జీవితంలో కలలు కననివాళ్లు ఏమి సాధించలేరనేది వాస్తవం..ఎవరికైనా జీవితంలో ఒక ambition, ఒక goal, ఒక dream ఉన్నప్పుడే అవి జీవితంలో వాస్తవాలుగా పరివర్తన చెందుతాయి. అందుకే Missile man of India అబ్దుల్ కలాం "True Dreams" గురించి ఒక గొప్ప inspiring మాట చెప్పాడు. "A dream is not that which you see while sleeping; it is something that does not let you sleep". నువ్వు ఏ కలనైతే కంటావో..నీవు ఏ స్వప్నాన్నైతే ఊహించుకుంటావో అది నీవు సాధించే వరకు నిన్ను నిద్రపోనివ్వనిదే "నిజమైన స్వప్నం" ఆ స్వప్నం సాకారం కావాలంటే యుద్ధవీరునిలా పోరాటం చేయాలి. నిరంతరం ఆ స్వప్నాన్నే తపిస్తూ సాధించుకోవాలి.

"పరావలయం" కవితలో తను కన్న కలల గురించి ఆ కలలు ఎలా చెదిరిపోయాయని, ఎవరో ఎత్తుకెళ్లారని ఈ క్రింది వాక్యాల్లో వాపోతాడు.

పున్నమి వెన్నెల్లో, పూదోటల్లో/పరిమళమై విహరిస్తున్న
చీకటిరాత్రి చెరువు గట్టుమీద/నిశ్చలమైన నీటి చల్లని
అంచులపైన
పవలించిన నా కలలను ఎత్తుకెళ్లారు.

"దుఖాయాతన" అనే రైతుల ఆత్మహత్యల మీద రాసిన కవితలో...రెండు మనసుల మధ్య కొనసాగిన జ్ఞాపకాలను, కనుకొలుకుల్లోంచి జారిపోయిన జీవితాలను...గతానికీ వర్తమానానికీ మధ్య తారసపడే సంఘర్షణలో మధించి పొందిన జ్ఞానం పనికిరాకుండా పోతున్న హృదయవిదారక సందర్భాన్ని ఉరితాళ్ళల్లో, పురుగుమందుల్లో బలైపోతూ.. శాశ్వతంగా నిద్రపోతున్న రైతన్నల గురించి ఆక్రోశిస్తాడు. నీళ్ళ గురించి "నీటిపువ్వు" కవితలో..నది అంటే నడుస్తున్న సంపద.. నది అంటే నడుస్తున్న చరిత్ర ...నీటిని మూటగట్టి పొలాల్లో విప్పితే సీతాకోకచిలుకల గుంపవుతుంది.. నేలంతా రంగుల పూవులై తేనె మరకల సంతకమై మేడిగడ్డ నుంచి తరలివస్తున్నపాలపొదుగులాంటి నది ఒత్తిపోయిన చెరువుల్లో జలసిరులు కురిపించే ప్రజల కలల నీటిపువ్వు అంటూ నదిలా కవిత్వంలో హొయలు పోతాడు.

"నిజమైన మనిషి" కవితలో...నాలుగు మెతుకులు కాదు నాలుగు అక్షరాలు ముఖ్యమని మట్టి మనుషుల మెదళ్ళలో నాటిన దీనబంధు మహాత్మా పూలే అంటూ ఈ నేలమీద నడిచిన నిజమైన మనిషిని కొనియాడతాడు. గాయపడిన కవి హృదయం సాక్షిగా మానవత్వపు మర్రి ఊడల మీదుగా నీలినీలి మేఘమై వెండితెర వీణను పలికించినావంటూ.."దీపమాళిక"అనే కవితలో తెలంగాణ కవితాభాస్వరం దాశరథి గురించి.. చంద్రున్ని మనచేతుల్లో పెట్టి, వెన్నెల పాటలు వినిపించినవాడంటూ తోటలో పాటల విత్తులు నాటి హృదయాలను పూయించి మనసులను మైమరపించిన మరో తెలంగాణ ఆణిముత్యం సినారె గురించి "అతడు లేక పాట లేదు" అనే కవితలో ఆయనకు కవిత్వతోరణం కడతాడు.

ఈ సంపుటిలోని అన్ని కవితల్లో ప్రవీణ్ మనిషికవిగా కనిపించినా, అక్కడక్కడ ప్రేమకవినని కవితా వాక్యాల్లో నిజాయితీగా నిరూపించుకుంటాడు. అసలు కవిలో ప్రేమతత్వం లేనిది కవిత్వతత్వం ఎలా అర్థం అవుతుంది? "శ్రీదేవి" అనే కవితలో.

యవ్వనం గదిలోని కాటుక నీవు దిద్దుకున్నాక
వెన్నెల నీ చూపుకై ఎదురుచూసింది
అందం నిన్ను అందుకోవాలని
నీ అడుగుల వెంట పరుగు తీసింది
సౌందర్యం నీ ముందు మోకరిల్లింది

అభినేత్రి శ్రీదేవి మరణాన్ని జీర్ణించుకోలేని ఈ ప్రేమకవి ఆ అద్భుతమైన అందాలరాశిని ప్రేమైక హృదయంతో పై వాక్యాల్లో అభివర్ణిస్తాడు.ఇంకా కొన్ని ప్రేమ కవితలు... "స్వప్నం", "మౌనం తడి", "ఆరని స్పర్శ", "ఎడబాటు", "ఆశలు జారిపోయాక", "సంభావ్యత". కరోనా రక్కసి మీద కూడా తన కలాన్ని ఝుళిపించి కవితలు రాశారు. అవి "చావు చిత్తడి", "అంతా మన చేతుల్లోనే", "కొంచం ఉపశమనం కావాలి", "జీవితపు సరిహద్దుల దగ్గర". ఈనాటి ఆధునిక సమాజ పోకడల్ని అత్యుత్తమంగా కవిత్వీకరిస్తూ గుండె నిండా కవిత్వతడి మెండుగా కలిగి ఉన్నఈ కవి రానున్న రోజుల్లో ఇంకా మెరుగైన కవిత్వ సంపుటీలను వెలువరించాలని కవిత్వపూర్వకంగా కోరుకుంటూ...



**ప్రొఫెసర్ బాణాల శ్రీనివాసరావు**
**మొబైల్ : 940471423**

## పుస్తక సమీక్షల కోసం...

**తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.**
**43/A, MLA Colony, Road No. 12,**
**Banjara Hills, Hyderabad.**
**Telangana- 500034.**

## రచనలకు ఆహ్వానం

**సాహిత్య పేజీ కోసం కవులు,**
**రచయితల నుండి కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,**
**పుస్తక సమీక్షలు మొదలైనవి..**
**మీ రచనలు పంపాల్సిన చిరునామా:**
**mahaapatrika@gmail.com**
**whatsapp 9247580946**





# కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

**ఆదిలాబాద్ మహా:** సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమం లో భాగంగా కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ నియమాకాల కోసం జైనథ్ మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి హాజరైన నాయకులు మండల పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. పార్టీ నేతలతో కలిసి డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి , మాజీ ఎంపీ సోయం బాపూరావు , మార్కెట్ కమిటీ చైర్మన్లు బోరంచు శ్రీకాంత్ రెడ్డి అశోక్ రెడ్డి లతో కలిసి పార్టీ నూతన కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.



# శంషాబాద్‌లో ఘనంగా బోనాల వేడుకలు

**అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్..**

**రాజేంద్రనగర్ మహా;** ఆషాడ బోనాల సందర్భంగా శంషాబాద్ సర్కిల్ పరిధిలో ఆదివారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సర్కిల్ పరిధిలోని పలు దేవాలయంలోని అమ్మవార్లను దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ప్రారంభమైన శ్రీకృష్ణ జయంతి వేడుకలు

**కుషాయిగూడ, మహా :** భక్తి, భారతీయ సంస్కృతి, సనాతన విలువలను చిన్నారుల్లో పెంపొందించాలనే లక్ష్యంతో యశోద బాలగోకులం మరియు శ్రీరామ బాలగోకులం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "శ్రీకృష్ణ జయంతి వేడుకలు-2026" ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు సెప్టెంబర్ 4 వరకు వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక, విద్యా కార్యక్రమాలతో కొనసాగనున్నాయి.ఈ నెల రోజుల ఉత్సవాల్లో భాగంగా ఈరోజు ఆనంద్‌బాగ్‌లోని అష్టభుజా దేవి ఆలయంలో ధ్వజారోహణం, గురుపూజ, అలాగే పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల సన్మానం చేసారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఇన్‌కమ్ ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ ఆర్. జయకుమార్ హాజరై ఆశీర్వచనం అందించారు. నెల రోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాల్లో భజనలు, సాం



స్కృతిక కార్యక్రమాలు, ధార్మిక బోధనలు, చిన్నారులకు విలువల ఆధారిత శిక్షణ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో విపిన్, జిమ్మి, జీవన్ , దీపా , కన్నన్ తదితరులు పాల్గొన్నారు.



# రైతు రిలే దీక్షలు
# మరోసారి భగ్నం...

**రైతు దీక్షలు భగ్నంతో బహదూర్ గూడా గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు....**

రాజేంద్రనగర్ మహా ; తమ భూములను బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం ఇవ్వలేమంటు శంషాబాద్ సర్కిల్ బహదూర్ గూడ లోని సౌడి వద్ద రైతులు ఫెక్సీ లు ఏర్పాటు చేసుకొని గత రెండు రోజులు నుండి మరోసారి రిలే దీక్షలు చేపట్టారు. ఆదివారం శంషాబాద్ ఇన్స్పెక్టర్ తో సహ ఎస్సైలు, పోలీస్ సిబ్బంది భారీగా చేరుకుని రిలే దీక్షలకు ఎలాంటి అనుమతులు లేవని ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను తీసివేశారు. రైతులు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా తమ గ్రామంలో రిలే దీక్షలు చేస్తుంటే పోలీసులు వచ్చి రిలే దీక్షలకు సంబంధించిన ఫేక్సీలు, చించి వేసి, రైతులను గ్రామస్తులను అక్కడ్నుంచి పంపించి వేయడంలో ఆంతర్యమేమిటని రైతులు ప్రశ్నించారు. బుల్లెట్ ట్రైన్ కోసం తమ భూములను తీసుకుంటున్న ప్రభుత్వం రైతులను సంప్రదించి సరైన పరిహారం ఇవ్వాలన్నారు. రైతులకు సరైన పరిహారం చెల్లించకుండా బహదూర్ గూడా రైతు భూములను తీసుకోవడంపై ఆందోళనలు చేస్తుంటే పోలీసులు తమ ఆందోళనను విచ్చిన్నం చేయడంపై ఆక్రోశాన్ని వెళ్లగక్కారు.





# కాంగ్రెస్ మండల స్థాయి సమావేశాలు

- **బలోపేతం పై ఫోకస్**
- **మండల కమిటీల నియామకం**
- **పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి**
- **కంది శ్రీనివాస రెడ్డి, నరేష్ జాదవ్ పిలుపు**

**ఆదిలాబాద్ మహా :** కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పనిచేస్తూ పార్టీకి మంచి పేరు తెచ్చేలా పనిచేసే నాయకులు కార్యకర్తలను మండల కమిటీ కి ఎంపిక చేయాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి , డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ సూచించారు. సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమం లో భాగంగా కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ నియమాకాల కోసం భోరజ్, జైనథ్,బేల, సాత్నాల మండల కేంద్రాలలో నిర్వహించిన సమావేశానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి హాజరయ్యారు. నీ మనిషి నా మనిషి అని కాదని ఎవరిని ఎంపిక చేసినా వారు పార్టీ కి చెందినవారన్నారు. ఎంపిక చేసిన మండల కమిటీ సభ్యులు మండల అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు.గెలుపోటములు ముఖ్యం కాదని ఒకసారి ఓడినా రేపటి గెలుపుపై ఆశతో పని చేయాలన్నారు.ఇందిరమ్మ ఇండ్లను తనే ఇస్తున్నట్టుగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ చెప్పకోవడం సిగ్గు చేటన్నారు.ఇందిరమ్మ అంటేనే కాంగ్రెస్ పార్టీ అన్నారు.పాయల్ శంకర్ కు భయపడాల్సిన అవరం లేదన్నారు. గ్రామాలలో ఎమ్మెల్యే కాని ఆయన అనుచరులు కాని బెదిరిస్తే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న పథకాలలో ఎమ్మెల్యే పాత్ర ఎంత మాత్రం లేదన్నారు.ఎయిర్ పోర్ట్ కోసం రెండువేల కోట్లు ఇస్తోంది కాంగ్రెస్ పార్టీ అని రుణ మాఫీ , రైతు భరోసా , ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తోందన్నారు.వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే గెలుపు తథ్యమన్నారు.పాయల్ శంకర్ కు డిపాజిట్ కూడా దక్కదన్నారు. మనందరం కష్టపడితే వచ్చే ఎన్నికలలో మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వమే ఏర్పడుతుందని రేవంత్ రెడ్డి తిరిగి సీయం అవుతారని అన్నారు. అలాగే దేశంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొచ్చి మన ప్రియతమ నేత రాహుల్ గాంధీ ప్రధాని అవుతారన్నారు. ప్రతీ నాయకుడు కార్యకర్త పార్టీ బలోపేతం పై దృష్టి తమ తమ మండలాలలో బూత్‌ల వారీగా పార్టీ ని పటిష్ట పరచాలని పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ మాట్లాడుతూ నూతన మండల కమిటీల నియామకంలో ఎలాంటి వర్గ విభేదాలకు తావులేకుండా అందరినీ కలుపుకొనిపోవాలని, సామాజిక న్యాయం పాటిస్తూ పారదర్శకంగా కమిటీలను సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి మండల కమిటీలో మండల అధ్యక్షునితో కలిపి మొత్తం 22 మంది సభ్యులు ఉంటారన్నారు.. ఇందులో ఇద్దరు ఉపాధ్యక్షులు, నలుగురు ప్రధాన కార్యదర్శులు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. పార్టీ కమిటీలలో మహిళా నాయకులకు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత కల్పించాలన్నారు.సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ల అనుభవాన్ని ఉపయోగించుకునేలా ప్రతి మండలంలో పొలిటికల్ అఫైర్స్ కమిటీ ని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కమిటీల ఏర్పాటు ప్రక్రియను ఆగస్టు 15 లోగా పూర్తి చేయాలని గడువు విధించారు. పార్టీ అభివృద్ధికి, ప్రజల సమస్యలపై అంకితభావంతో పనిచేసే ప్రతి నాయకుడిని, కార్యకర్తను పార్టీ అధిష్టానం ఖచ్చితంగా గు గుర్తించి తగిన గౌరవం అందిస్తుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సోయం బాపూరావు,ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి , మాజీ డిసిసి అధ్యక్షుడు సాజీద్ ఖాన్ , మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవ రెడ్డి , జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బాలూరి గోవర్ధన్ రెడ్డి ,ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ ,జిల్లా ఉపాధ్యక్షులు మాధవ్ పటేల్ , గిమ్మ దీపక్ ,జిల్లా ప్రధాన కార్యదర్శులు మల్యాల కరుణాకర్ , అక్తర్ అలీ నాయకులు బెజ్జంకి అనిల్ , ఎంఏ షకీల్ ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, గ్రామాల సర్పంచ్ లు ఉప సర్పంచ్ లు పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# గాంధీనగర్ బోనాల మహోత్సవాల్లో ఎమ్మెల్యే

- **అమ్మ చల్లంగా చూడాలని ప్రత్యేక పూజలు**

**కుషాయిగూడ, మహా :** కాప్రా డివిజన్ పరిధిలోని గాంధీనగర్‌లో నిర్వహించిన ఆషాఢ బోనాల మహోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహోన్నత పండుగ అని అభివర్ణించారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఐశ్వర్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ, ప్రజలపై అమ్మవారి కటాక్షం ఎల్లప్పుడూ ఉండాలని బండారు లక్ష్మారెడ్డి ప్రార్థించారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతిని, ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు చేరవేసే గొప్ప ఉత్సవమని ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కాకకాసం మైపాల్ రెడ్డి, ఇంద్రయ్య, మహేష్, బైరి నవీన్ గౌడ్, తెలంగాణ ఉద్యమకారులు. గాంధీనగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు . కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి ఇంటా ఇంకుడు గుంత ఉండాలి

- **భూగర్భ జలాలు అడుగంటుతున్న వేళ**
- **నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చాలి**
- **ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ, మహా :** వర్షపు నీటిని భూగర్భ జలాల్లోకి ఇంకించే రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలు, ఇంకుడు గుంతలు, రీచార్జ్ బోర్‌వెల్లు, చెక్‌డ్యాంలు, ఫార్మ్ పాండ్ల నిర్మాణాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా చేపట్టాలని ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ భూగర్భ జలాల పరిరక్షణకు ప్రతి ఇంటా నీటి సంరక్షణ చర్యలు తప్పనిసరి అని అన్నారు. ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, కాలనీలు, బస్తీల్లో రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసి వాటి అమలును కచ్చితంగా పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి ప్రజాప్రతినిధి, ప్రతి పౌరుడు తన ఇంటిలో కనీసం ఒక ఇంకుడు గుంత లేదా బోర్‌వెల్ రీచార్జ్ వ్యవస్థను ఏర్పాటు చేసి వర్షపు నీటిని భూగర్భ జలాల పునరుద్ధరణకు వినియోగించాలని బండారు కోరారు. రోజురోజుకు భూగర్భ జలాలు అడుగంటిపోతున్న నేపథ్యంలో వాటి పునరుద్ధరణ అత్యవసరమని పేర్కొన్నారు. "ప్రతి ఇంటికి ఇంకుడు గుంత భవిష్యత్ తరాల కోసం నాటిన నీటి మొక్క వంటిదే" అని బండారు లక్ష్మారెడ్డి వ్యాఖ్యానించారు. నీటిని పొదుపుగా వినియోగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, నీటి వృథాను అరికట్టాలని ఆయన సూచించారు.మెట్రో నగరాల్లో ఇప్పటికే నీటి కొరత సమస్య తీవ్రంగా మారుతోందని పేర్కొన్న ఆయన, నీటి సంరక్షణపై ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకుంటే వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు పెరగడంతో బోర్లు ఎండిపోకుండా ఉంటాయని అన్నారు. ప్రతి ఒక్క ఇంటి యజమానులు ముందుకు వచ్చి నడుం బిగించాలని నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు

# శ్రీ మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడుగా కొంపల్లి చంద్రమోహన్

**కుషాయిగూడ, మహా :** మౌలాలి హౌసింగ్ బోర్డ్ డివిజన్లోని పద్మశాలి సంక్షేమ సంఘానికి నూతన కార్యవర్గం ఎన్నిక హెచ్ బి కాలనీ లోని శ్రీ మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా కొంపల్లి చంద్రమోహన్, (సీనియర్ జర్నలిస్ట్) ప్రధాన కార్యదర్శిగా దుడుక లక్ష్మీనారాయణ, కోశాధికారిగా జీ.సతీష్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు చంద్రమోహన్ మాట్లాడుతూ సంఘం కోసం నిరంతరం పనిచేస్తానని సంఘంలో ప్రతి సభ్యునికి ఏ ఇబ్బందులు ఉన్న నా దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు. ఉపాధ్యక్షులుగా మాకం అంజయ్య, ఏ. శ్రీహరి సంయుక్త కార్యదర్శులుగా పి. జగన్నాథ్ పి. వెంకటేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏం. వినోద్



కుమార్, ఆడెపు పెంటయ్య, బి చంద్రశేఖర్, సలహాదారులుగా మామిడాల శ్రీపతి, వడిచర్ల గోపాల్, విజయ్ కుమార్ బేతి పాండు, ఉదయ్ చంద్ర, జి సూర్య ప్రకాష్, మరో 10 మంది కార్యనిర్వాహక సభ్యులుగా ఎన్నికయ్యారు

# చర్లపల్లి .సీతారామాలయంలో సీసీ ఫ్లోరింగ్ పనులకు ఎమ్మెల్యే సొంత నిధులు

**కుషాయిగూడ, మహా:** చర్లపల్లి ప్రాంతంలోని శ్రీశ్రీశ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం సీసీ ఫ్లోరింగ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో ఈ పనులు చేపట్టినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.దేవాలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో సీసీ ఫ్లోరింగ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు వారు పేర్కొన్నారు. దేవాలయ అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయంలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు భవిష్యత్తులోనూ అభివృద్ధి పనులు కొనసాగిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



# మీరాలం కుంట, కాలుష్యంపై మండిపడ్డ సుమన్ గౌడ్

- **ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అటువైపు కన్నెత్తి కూడా చూడని సంబంధిత ఇరిగేషన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ మరియు హైడ్రా అధికారులు**
- **థ ఆనంద్ హోమ్స్, సంస్కృతి టౌన్‌షిప్ డ్రైనేజీ నీటిని చెరువులోకి మళ్లించడం దారుణం"**



**ఘట్‌కేసర్, మహా :** ఘట్‌కేసర్ సర్కిల్, పోచారం డివిజన్ పరిధిలోని అన్నోజిగూడలో ఉన్న స్థానిక మీరాలం కుంట అక్రమార్కుల పాలిట కామధేనువుగా మారుతోందని, ఒకవైపు కుంటను యథేచ్ఛగా మట్టితో పూడ్చివేస్తుంటే, మరోవైపు పక్కనే ఉన్న థ ఆనంద్ హోమ్స్ అపార్ట్‌మెంట్ మరియు సంస్కృతి టౌన్‌షిప్ భారీ బహుళ అంతస్తుల బిల్డింగ్‌ల నుండి మురుగునీటి డ్రైనేజీ వ్యవస్థను నేరుగా చెరువులోకి వదులుతున్నారని బాలగౌని సుమన్ గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా సంబంధిత ఇరిగేషన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ మరియు హైడ్రా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం దారుణమన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కుంటను పూర్తిగా మట్టితో కప్పేసి, మురుగునీటితో కలుషితం చేసిన తర్వాత అధికారులు చర్యలు తీసుకుంటారా? అని ప్రశ్నించారు. కళ్లముందే సహజ సిద్ధమైన నీటి వనరు నాశనమవుతుంటే "రోకటి బండ కింద వేలు పెట్టి నాకేమి సంబంధం లేదన్నట్లు" అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వెనుక ఉన్న రహస్యమేమిటని నిలదీశారు. "మేకతోలు కప్పుకున్న పులుల్లా" కొందరు అక్రమార్కులు మరియు కాలుష్యకారకులు ప్రభుత్వ ఆస్తులను, చెరువులను నాశనం చేస్తుంటే, అధికారులు మాత్రం "చెవిటివాని ముందు శంఖం ఊదినట్లు" ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా పట్టించుకోకపోవడం వెనుక లోపాయికారీ ఒప్పందాలు ఉన్నాయా అని సందేహం వ్యక్తం చేశారు. "చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు" పరిస్థితి చేయి దాటిపోకముందే అధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. కుంటలో పోసిన మట్టిని వెంటనే తొలగించి, డ్రైనేజీ నీరు కలవకుండా అడ్డుకట్ట వేసి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి మీరాలం కుంటను మళ్లీ పూర్వ రూపానికి తీసుకురావాలని సుమన్ గౌడ్ గట్టిగా డిమాండ్ చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించకపోతే ప్రజలతో కలిసి భారీ స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



# ఆలేరు ప్రజల చిరకాల కోరిక రెవెన్యూ డివిజన్

**ఆలేరు ఆగస్టు 2 మహా :** ఆలేరు ప్రజల, అఖిలపక్ష పార్టీల చిరకాల కోరిక రెవెన్యూ డివిజన్ అని ఆలేరు రెవెన్యూ డివిజన్ అఖిలపక్ష పోరాట కమిటీ కన్వీనర్ పసునూరి వీరేశం, కోకన్వీనర్లు చెక్క వెంకటేష్, రాచకొండ జనార్దన్, రచ్చ రామ్ నర్సయ్య, మొరిగాడి రమేష్ లు అన్నారు...ఈ మేరకు ఆలేరు ఆర్యవైశ్య సంఘంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో వారు మాట్లాడారు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య రెవెన్యూ డివిజన్ కోసం విచిత్ర పొత్తు పెట్టుకున్నారని అనడం విచిత్రంగా ఉందని... ఆలేరు ప్రజల పార్టీల ఆకాంక్ష రెవెన్యూ డివిజన్ మాత్రమేనని వారు తెలిపారు... డివిమిటేషన్కు సంబంధం లేకుండా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి శ్రీనివాసరెడ్డితో మాట్లాడి ఆలేరు రెవెన్యూ డివిజన్ ను త్వరితగతిని ప్రకటించాలని వారు కోరారు ఎమ్మెల్యే మాట ప్రకారం అఖిలపక్ష నాయకులను సీఎం తోపాటు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వద్దకు తీసుకెళ్లాలని కోరారు ఆలేరు బంద్ కు స్పందించి అఖిలపక్ష నాయకులతో ఎమ్మెల్యే చర్చలు జరప డాన్ని అఖిలపక్ష నాయకులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలోపంతం కృష్ణ,కర్రె అశోక్, ఎలుగల వెంకటేష్, కామిటికారీ అశోక్,బేతి కృష్ణ హరి, వడ్డేమాన్ బాలరాజ్,ఎర్రం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజల మనసును గెలుచుకున్న డాక్టర్ జ్యోతి

**వలిగొండ ఆగస్టు 2 మహా న్యూస్** మండలంలోని వర్కట్ పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తున్న డాక్టర్ జ్యోతి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా డాక్టర్స్ అభిమానులు ప్రజాసంఘాల నాయకులు వివిధ కుల సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రజల మనసును గెలుచుకున్న డాక్టర్ జ్యోతి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని అన్నారు ప్రజల తో మమేకమై ఉండడం అభినందనీయమన్నారు

# పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్ మెంట్ లో జిల్లా నిరుద్యోగ యువతకు అన్యాయం

**ఏ ఐ వై ఎఫ్**

**భువనగిరి ఆగస్టు 2 మహా న్యూస్ :** అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ రామన్నపేట 12వ మండల నిర్మాణ మహాసభ ఎర్ర రమేష్ అధ్యక్షతన ఆదివారం జరిగింది ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఏల్లంకి మహేష్, పేరబోయిన మహేందర్ మాట్లాడుతూ జూలై 29న రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినటువంటి పోలీసు రిక్రూట్మెంట్ నోటిఫికేషన్ లో కోడ్ నెంబర్ 21 సివిల్ కానిస్టేబుల్ మరియు కోడ్ నెంబర్ 22 ఏఆర్ కానిస్టేబుల్ జాబితాలో యాదాద్రి భువనగిరి జిల్లా (ఖాళీలు)లేకపోవడం వల్ల జిల్లాకు సంబంధించిన నిరుద్యోగుల్లో ఆందోళన మొదలైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2021 డిసెంబర్ 317 జీవో ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా,రాచకొండ పరిధిలో ఉండేది నల్గొండ సూర్యాపేట ఇతర జిల్లాలకు చెందిన పలువురు కానిస్టేబుళ్లు యాదాద్రి జిల్లాలో విధులకు కేటాయించబడ్డారు ఈ కేటాయింపు పారదర్శకంగా జరగలేదన్నారు. అనంతరం ప్రభుత్వం పోలీస్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించి యాదాద్రి భువనగిరి జిల్లాను రాచకొండ కమిషనరేట్ పరిధి నుండి వేరు చేసి 6నెలలు గడుస్తున్నప్పటికీ ఇతర జిల్లాలకు చెందిన కానిస్టేబుల్ లను వారు సంబంధిత స్థానిక కేడర్లకు బదిలీ చేయకపోవడం వల్ల నల్లగొండ సూర్యపేట జిల్లాలో గణనీయమైన ఖాళీలు ఏర్పడ్డాయి కానీ యాదాద్రి భువనగిరి జిల్లాలో ఖాళీలు లేకుండా పోయింది జిల్లాకు చెందిన నిరుద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. వెంటనే ఇతర జిల్లాల నుంచి వచ్చిన కానిస్టేబుళ్లను సంబంధిత స్థానిక కేడర్లకు బదిలీ చేసి వాస్తవిక ఖాళీలను గుర్తించి నోటిఫికేషన్ వెయ్యాలని ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద విద్యార్థి యువతపై జరిగిన లాఠీచార్జి ప్రజాస్వామ్యం పై దాడి అని సమగ్ర విచారణ చేసి బాధ్యులను శిక్షించాలని కోరారు. విద్యా వైద్యం ప్రవేటీకరణకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 8, 9 10 తేదీలలో యాదగిరిగుట్టలో జరిగే ఏఐవైఎఫ్ యువజన ప్రదర్శన బహిరంగ సభను విజయవంతం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది అధ్యక్షులుగా కళ్లెం స్వామి,ఉపాధ్యక్షులు వినయ్ ,ప్రధాన కార్యదర్శిగా రచ్చ దయాకర్ సహాయ కార్యదర్శి కొత్త లింగస్వామి,కోశాధికారిగా ఊట్కూరి శ్రీను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది... ఈ నిర్మాణ మహాసభలో సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నయీం, జిల్లా కోశాధికారి సాయి, పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి , పాండు , వీసం గాలయ్య, నాగరాజు, సంగిశెట్టి నవీన్, తదితరులు పాల్గొన్నారు.




# ఆగస్టు 10న జైల్ భరో'ను జయప్రదం చేయండి : సిర్పంగి స్వామి

**వలిగొండ ఆగస్టు 2 మహా న్యూస్ :** నాటి స్వాతంత్ర్య పోరాటానికి ఊపిరిలూదిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో భారతదేశాన్ని కాపాడుకునేందుకు ఆగస్టు 10వ తేదీన జరిగే జైల్ భరో'ను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిర్పంగి స్వామి పిలుపునిచ్చారు ఆదివారం మండల పరిధిలోని పులిగిల్ల గ్రామంలో "జైల్ భరో" కార్యక్రమ విజయవంతం కోసం ముద్రించిన కరపత్రాలను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తుందని ఎందరో పోరాట యోధుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న దేశ స్వాతంత్రాన్ని విదేశీ సంస్థలకు తాకట్టు పెడుతూ నయా ఉదారవాద సంస్కరణలు అమలు చేస్తుందన్నారు నాటి స్వాతంత్ర కాలంలో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను ఉల్లంఘించి నూతన లేబర్ కోడ్లను ముందుకు తెచ్చిందని దీని ద్వారా కార్మిక హక్కులను హరించి వేస్తుందన్నారు, 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచేందుకు యాజమాన్యాలు కార్మికులను దోపిడీ చేసేందుకు పూర్తి స్వేచ్ఛనిస్తుందని మరోవైపు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ నూతన విబిజి గ్రామ్ జీ పథకం గా పేరును మార్చి రాష్ట్ర ప్రభుత్వాలపై పెద్ద ఎత్తున భారం వేస్తూ తన బాధ్యతను తప్పుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్టలు చేస్తుందన్నారు అమెరికా బ్రిటన్ న్యూజిలాండ్తో కేంద్ర ప్రభుత్వం స్వేచ్ఛ వాణిజ్యవాపొందాలు చేసుకుని భారత వ్యవసాయ రంగంలో 32 దేశాల నుండి దిగుమతులను ప్రోత్సహిస్తుందని వీటికి జీరో సుంకంతో దిగుమతులు రావడంతో దేశీయ వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తగ్గిపోయి రైతులు దివాలా తీసి అవకాశాలున్నాయన్నారు భారతదేశంలో ఏటా పద్దెనిమిది లక్షల కోట్ల వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్కు వస్తుండగా కనీసం మద్దతు ధరలు అమలు జరుపుకోవడం వల్ల రైతులు ఏటా నాలుగు లక్షల కోట్లు నష్టపోతున్నట్లు ప్రముఖ ఆర్థికవేత్త అశోక్ గులాటి ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు వ్యవసాయ ఉత్పత్తుల వ్యయం పై 50% కలిపి మద్దతు ధరలు నిర్ణయిస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఉత్పత్తి ధరలను తగ్గించి నిర్ణయించడం వల్ల రైతులకు గిట్టుబాటు ధర రావడంలేదని వెంటనే పార్లమెంట్లో కనీస మద్దతు ధరలు చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు ఈ రకంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఆగస్టు 10వ తేదీన జిల్లా కలెక్టరేట్ల ముందు జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమంలో వివిధ రంగాల కార్మికులు, రైతులు వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల ఉపాధ్యక్షులు వాకిటి వెంకటరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు దొడ్డి బిక్షపతి,సిఐటియు హమాలి నాయకులు వడ్లకొండ శంకరయ్య, నాయకులు ఊర్ల రమేష్, రాములు ,యాదగిరి, మారబోయిన సతీష్, ప్రశాంత్, వడ్డేమాన్ వెంకటయ్య, లతీఫ్, తదితరులు పాల్గొన్నారు

# పుట్టగొడుగుల పుట్టుకొస్తున్న ఉద్యమ సంఘాలు

- **రాజకీయాలకు అతీతంగా ఉద్యమకారులను గుర్తించండి**
- **సంగిశెట్టి క్రిస్టఫర్ మలిదశ ఉద్యమకారుడు**

**భువనగిరి ఆగస్టు 2 మహా న్యూస్ :** ఉద్యమకారుల సంఘాల పేరుతో రోజుకొక సంఘం పేరుతో పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నాయని మలిదశ ఉద్యమకారుడు సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు ఎన్ని సంఘాలు పుట్టుకొచ్చిన ప్రభుత్వం త్యాగాలు చేసిన ఉద్యమకారులను గుర్తించడం తద్యమని అందులో ఎలాంటి సందేహం లేదని అన్నారు గుర్తింపు కమిటీ అన్ని విధాలుగా చర్చలు జరపడం స్వాగతిస్తున్నామని ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రభుత్వం దగ్గర స్పష్టమైన సమాచారం ఉందని తొందరలోనే ప్రత్యేక వెబ్సైటు ఏర్పాటు చేయబోతున్నట్లు ఉద్యమ కమిటీ తెలపడం జరిగిందన్నారు త్యాగాలు చేసిన ఉద్యమకారులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు



# ఇండ్ల స్థలాల కోసం సిపిఎం వంటవార్పు

భువనగిరి ఆగస్టు 2 మహా : ఆగస్టు 10లోగా ఇచ్చిన పట్టాలకు స్థలాలను చూపించకపోతే ఎమ్మార్వో, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల ముందు ఆందోళనలను ఉధృతం చేస్తామని సిపిఎం రాష్ట్ర నాయకురాలు బట్టుపల్లి అనురాధ హెచ్చరించారు...యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణ పరిధిలోని సింగన్నగూడెం శివారులో 700 సర్వే నంబర్లో 2005 ప్రభుత్వం పట్టాలి ఇచ్చి 21 సంవత్సరాలు అయితున్న ఇప్పటికీ ఇండ్ల స్థలాలు చూపించకపోవడంతో పట్టాలు పొందిన ఇండ్లు లేని నిరుపేద లబ్ధిదారులతో ఆదివారం వంట వార్పు కార్యక్రమం చేపట్టారు. పేదలకు పట్టాలు ఇచ్చి, పాతిక సంవత్సరాలు పైబడుతున్నా స్థలాలను చూపించక పాలక పక్షాలు విస్మరిస్తున్నారని పాలక పక్షాల, అధికారుల తీరును విమర్శించారు. గత 25 సంవత్సరాలుగా అనేక పోరాటాలు చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, అధికారులు మాయమాటలతో చెప్పుతూ కాలం వెళ్ళదిస్తున్నారని విమర్శించారు. గత సంవత్సరం అధికారులు గుడిసెలు వేసుకోవడంతో రాత్రికి రాత్రే పోలీసులు తొలగించారని ఆందోళన కార్యక్రమాలు చేపట్టినప్పుడు మాత్రమే అధికారులకు మా బాధలు గుర్తుంటున్నాయని ఇతర సమయంలో పట్టించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ, గంధ మల్ల మాతయ్య, వల్దాస్ అంజయ్య, బర్ల వెంకటేష్, కొత్త లక్ష్మయ్య, నారా కలమ్మ, దొడ్డి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# 6 నుంచి సీపీఐ ప్రజా చైతన్య యాత్రలు..

- **మణుగూరులో భారీ జన సమీకరణకు నేతల పిలుపు..**
- **చైతన్య యాత్ర పోస్టర్ ఆవిష్కరణ..**

**మణుగూరు, మహా :** ప్రజా సమస్యల పరిష్కారం, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ లక్ష్యంగా ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న సీపీఐ ప్రజా చైతన్య యాత్రలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు సరెడ్డి పుల్లారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మణుగూరులోని సీపీఐ పార్టీ కార్యాలయంలో జరిగిన మణుగూరు మండల, పట్టణ కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్కే సర్వర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పుల్లారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, నిరుద్యోగం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, రైతు-కార్మిక సమస్యలు, విద్యా-వైద్య రంగాల సంక్షోభం, మహిళల భద్రత, దళితులు, ఆదివాసులపై జరుగుతున్న దాడులు, రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న ప్రజా సమస్యల పరిష్కారం, ఎన్నికల హామీల అమలు వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఈ యాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ పార్టీ పిలుపు మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఏడుళ్ల బయ్యారం నుంచి ఈ నెల 6వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రజా చైతన్య యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ఏడు రోజుల పాటు సాగే ఈ యాత్రలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా తదితర రాష్ట్ర, జిల్లా నాయకులతో పాటు సుమారు 100 మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. మణుగూరులో భారీ జన సమీకరణతో పాటు 6వ తేదీన నిర్వహించే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం సీపీఐ ప్రజా చైతన్య యాత్రల వాల్ పోస్టర్ను పార్టీ నాయకులు ఆవిష్కరించారు. సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్‌రావు, ఎడారి రమేష్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, మండల సహాయ కార్యదర్శి వేర్పుల నరేష్, పట్టణ సహాయ కార్యదర్శులు తోట రమేష్, చింతల దశరథం, కార్యవర్గ సభ్యులు కొత్తపల్లి సీతారాములు, నూనావత్ మంగమ్మ, ఎస్వీ నాయుడు, సర్పంచ్ బాడిశ కల్పన, బాడిశ సతీష్, ఆదరణ రాములు, నోముల రవి, కన్నెబోయిన ప్రసాద్, భీమరాజు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# సత్తుపల్లి అభివృద్ధికి సింగరేణి సహకారం కీలకం: ఎమ్మెల్యే రాగమయి

- **నూతన ఏరియా జీఎం ఎస్. వెంకటాచారి మర్యాదపూర్వక భేటీ.. సంక్షేమం, అభివృద్ధిపై చర్చ**

**సత్తుపల్లి, ఆగస్టు 2:**మహా. సత్తుపల్లి ఏరియా నూతన జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్. వెంకటాచారి ఆదివారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీమతి మట్టా రాగమయి దయానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, పూల బొకే అందించి ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్ మాట్లాడుతూ సత్తుపల్లి సింగరేణి ఏరియా సమగ్ర అభివృద్ధితో పాటు ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అలాగే సత్తుపల్లి నియోజకవర్గంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు పూర్తి సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ. టు జీఎం బొల్లం శ్రీనివాస్, జేవీఆర్ ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రహ్లాద్, కిష్టారం ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ సునీల్ వర్మతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.




# ఘనంగా మహంకాళి బోనాల ఉత్సవాలు

- **బోనం ఎత్తిన మహిళలు శిగాలతో శివసత్తులు**
- **ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పణ**

**మహేశ్వరం ఆగష్టు 2 మహా:**మహేశ్వరం నియోజకవర్గం మంఖాల, రావిరాల, మహేశ్వరం గ్రామాల్లో శ్రీశ్రీశ్రీ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి మహంకాళి అమ్మవారి బోనాలతో గ్రామాలలో పండగ వాతావరణం నెలకొంది. గ్రామాలలోని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని, శివసత్తుల శిగాల ఆటలతో, ఆడపడుచులు బోనం ఎత్తి ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన వారు, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండించి సుభిక్షంగా ఆనందంగా ఉండాలని అమ్మవారిని కోరినట్లు తెలిపారు. అమ్మవారి భక్తులతో ఆలయాలన్ని కిటకిటలాడాలి, అమ్మవారికి మొక్కిన మొక్కులను నెరవేర్చుకుంటూ ప్రత్యేక పూజలు చేశారు. మరి కొంతమంది భక్తులు అమ్మవారికి ఓడిబియ్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కోరిన కోరికలు నెరవేర్చాలని భక్తులు అమ్మవారికి పూజలు చేసి మొక్కుకున్నారు.

# సేవకు చిరునామా..కోనేరు కుటుంబం

- **ఆ కుటుంబం విలువలకు హుందాతనానికి నిలువెత్తు నిదర్శనం**
- **అభ్యుదయ కళాసేవ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్**
- **ఘనంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కోనేరు సత్యనారాయణ జన్మదిన వేడుకలు**



**భద్రాద్రి కొత్తగూడెం,** మహా:కోనేరు కుటుంబం విలువలకు హుందాతనానికి సేవా తత్పరతకు నిలువెత్తు నిదర్శనమని అభ్యుదయ కళాసేవ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కోనేరు సత్యనారాయణ చిన్ని జన్మదినం సందర్భంగా ఆదివారం శ్రీనగర్ కాలనీలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలలో ఆచార్య డాక్టర్ మద్దెల తన బృందంతో పాల్గొని గజమాలలతోనూ శాలువాలతోనూ కోనేరు చిన్నిని ఘనంగా సత్కరించి అభినందించి పుష్పాభిషేకాన్ని జరిపించారు.ముందుగా కేక్ కట్ చేసి కోనేరు చిన్నికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ మాట్లాడుతూ రాజకీయాలలో నేడు విలువలు మృగ్యమై నిస్వార్ధ సేవలు త్యాగాలు కానరాక అంతరించిపోతున్న తరుణంలో రాజకీయాల్లో విలువలను హుందాతనాన్ని నికార్సైన నిబద్ధతను ఆచరించి చూపించి విలువలను కాపాడి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఒకసారి మంత్రిగా కొత్తగూడెం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లి తనదంటూ ప్రత్యేకముద్రవేసిన దివంగత కోనేరు నాగేశ్వరరావు తనయుడుగా కోనేరు సత్యనారాయణ చిన్ని వారి రాజకీయ ఆశయాలకు వారసుడిగా నిలిచి నిస్వార్థ సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యకర్తలకు ప్రజలకు అండగా ఉంటూ ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తున్నారని భవిష్యత్తులో చిన్ని ఇంకా ఉన్నత స్థానాలను అధిరోహించి ప్రజలకు ఆశాజ్యోతిగా నిలవాలని దీవించారు. అదేవిధంగా పెద్ద కుమారుడు కోనేరు పూర్ణచంద్రరావు లయన్స్ క్లబ్ నాయకుడిగా కొత్తగూడెం క్లబ్ సెక్రటరీగా కోనేరు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అధినేతగా సమాజానికి ఎన్నో రకాల సేవలు అందిస్తున్నారని ఈ విధంగా కోనేరు కుటుంబమంతా విలువలకు హుందాతనానికి యదార్థతకు సేవా తత్పరతకు నిలువెత్తు నిదర్శనమని అభ్యుదయ కళా సేవా సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కవి సినీ గీత రచయిత గాయకులు సమాజసేవకులు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ ఉద్ఘాటించారు. అనంతరం కోనేరు సత్యనారాయణ చిన్ని మాట్లాడుతూ కొత్తగూడెం ప్రజలకు అన్నివేళలా అండగా ఉంటానని ఏ సమస్య వచ్చినా ప్రజలందరూ తమకు కోనేరు కుటుంబం అండగా ఉంటుందని భావించాలని కోనేరు ఆశయాల సాధన లక్ష్యమని హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఆత్మీయ పండుగగా జరిగిన ఈ జన్మదిన వేడుకల సంబరంలో కోనేరు సత్యనారాయణ చిన్ని, ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ లతోపాటు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు జేవీఎస్ చౌదరి, అభ్యుదయ కళాసేవ సమితి సంఘ నాయకులు అపరబాలు అల్లి శంకర్, సినీ నటులు చిత్రపురి సొసైటీ వెల్ఫేర్ కార్యదర్శి తాండూర్ ధనరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండా రమేష్, రాష్ట్ర బీసీ నాయకులు సురేందర్, ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు కామ్రేడ్ దస్తగిరి డి.సుధాకర్, రాష్ట్ర మైనార్టీ నాయకులు సల్మాన్ ఖాన్ తోత, రాజేశ్వరరావు, సాయి కుమార్, అంబేద్కర్ సంఘం మహిళా నాయకురాళ్ళు బడికల పుష్పలత, జోగు రమాదేవి, కుంచె లావణ్య, రుద్రంపూర్ సర్పంచ్ రుక్మిణి, స్వర్ణలత ఆకుల పద్మ తదితరులతోపాటు కోనేరు కుటుంబానికి అత్యంత సన్నిహితులు, కార్పొరేటర్ రావి రాంబాబు, కార్పొరేటర్ హరిహరన్, కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు అంతోటి పాల్, ఐఎన్టీయూసీ నాయకులు సబ్బారపు మధుసూదన్ చిన్ని, కొత్తగూడెం పాల్వంచ కార్పొరేట్ వైస్ చైర్మన్ లలిత కుమారి, జేపీ కుమార్, జెపి సైమన్, పొన్నె కంటి సంజీవ రాజు, బుగుల రవి కుమార్ గౌడ్, సురేష్ గౌడ్, పాల్వంచ నుండి ఆకెళ్ళ రాఘవ అహ్మద్, వడ్లమూడి పూర్ణచంద్రరావు, ఇంకా వివిధ సంఘాల నుండి నాయకులు అభిమానులు శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున తరలివచ్చి కోనేరు సత్యనారాయణ చిన్నిని సత్కరించి అభినందించారు.



## మలిదశ తెలంగాణ ఉద్యమకారిణి పూనెం సీతకు..

# ఎమ్మెల్యే పాయం అభినందనలు

- **ప్రజా సేవలో మరింత బాధ్యతతో ముందుకు సాగాలని ఆకాంక్ష**

**మణుగూరు, మహా :** మలిదశ తెలంగాణ ఉద్యమకారిణిగా నియామక పత్రం అందుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్ పూనెం సీతను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అభినందించారు. ఆదివారం మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పూనెం సీతకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల సేవలను ప్రభుత్వం గుర్తించి తగిన గుర్తింపు కల్పించడం అభినందనీయమని అన్నారు. ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా పనిచేయాలని, ప్రజలకు మరింత చేరువై సమాజ అభివృద్ధికి సేవలందించాలని ఆకాంక్షించారు. బూర్గంపాడు మండలం ముసలమడుగు గ్రామపంచాయతీ పరిధిలోని చెరువు సింగారం గ్రామానికి చెందిన పూనెం సీత మాట్లాడుతూ, తనకు లభించిన ఈ గుర్తింపు వ్యక్తిగతంగా తనకే కాకుండా మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడికి దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజల కోసం మరింత బాధ్యతతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఎల్లప్పుడూ తనకు ప్రోత్సాహం, మార్గదర్శకత్వం అందిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బోగినేని వరలక్ష్మి, కొమరం సరస్వతి, బత్తుల సుజాత తదితరులు పాల్గొని పూనెం సీతకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# రేగా కాంతారావును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి

- **లేనిపక్షంలో మహిళలతో కలిసి ఆందోళన చేపడతాం: మహిళా సర్పంచ్‌లు**

**మణుగూరు, మహా :** మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావును వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని మిట్టగూడెం సర్పంచ్ జిమ్మా ఝాన్సీ, చింతిరియాల సర్పంచ్ ఏనిక ఉషారాణి, మరో సర్పంచ్ కల్పనతో పాటు పలువురు మహిళా నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాద్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుపై బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం వెంటనే స్పందించి తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు. మహిళల గౌరవం, భద్రతకు సంబంధించిన అంశాల్లో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని, ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయకుల విషయంలో పార్టీ స్పష్టమైన వైఖరి అవలంబించాలని అన్నారు. చట్టపరమైన విచారణకు పూర్తి సహకారం అందించడంతో పాటు పార్టీ కూడా తన స్థాయిలో బాధ్యతాయుత నిర్ణయం తీసుకోవాలని సూచించారు. మహిళలపై జరిగే వేధింపుల విషయంలో ఎవరిపట్లా వివక్ష చూపరాదని, గతంలో ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొన్న ప్రజాప్రతినిధులపై తీసుకున్న చర్యల మాదిరిగానే రేగా కాంతారావు విషయంలోనూ ఒకే ప్రమాణాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు మహిళలకు ఆదర్శంగా ఉండాలని, మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని తేలికగా తీసుకోవడం సమాజానికి తప్పుడు సంకేతాలు పంపుతుందని పేర్కొన్నారు. ఈ విషయంలో పార్టీ నాయకత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే మండల వ్యాప్తంగా మహిళలను ఏకతాటిపైకి తీసుకువచ్చి రోడ్డుపై బైఠాయింపులు, నిరసన కార్యక్రమాలు, ఆందోళనలు నిర్వహిస్తామని మహిళా సర్పంచ్‌లు జిమ్మా ఝాన్సీ, ఏనిక ఉషారాణి, బాడిశ కల్పనతో పాటు మహిళా నాయకులు హెచ్చరించారు.

# రేగా కాంతారావును వెంటనే అరెస్ట్ చేయాలి..

- **ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ జరిపి కఠినంగా శిక్షించాలి..**
- **మణుగూరు మండల మహిళా కాంగ్రెస్ డిమాండ్..**




**మణుగూరు, మహా :** పినపాక నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై నమోదైన లైంగిక వేధింపుల కేసులో వెంటనే అరెస్ట్ చేసి, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా వేగంగా విచారణ జరిపి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య డిమాండ్ చేశారు. ఆదివారం మణుగూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన మహిళా కాంగ్రెస్ నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళల విశ్వాసంతో ప్రజాప్రతినిధిగా ఎన్నికైన వ్యక్తిపై ఇలాంటి ఆరోపణలు రావడం బాధాకరమని, మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం, పోలీసులు రాజీ పడకుండా చట్టపరమైన చర్యలు వేగవంతం చేయాలని కోరారు. ఆరోపణలు నిరూపితమైతే నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసే ఘటనలను మహిళా కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తుందని, అవసరమైతే నియోజకవర్గ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా కార్మిక శాఖ నాయకురాలు బోగినేని వరలక్ష్మి, చప్పిడి మాధురి, కొలిపాక రమ, వేముల స్వరూప, అందాల శ్యామల, కుంచె పద్మ, కుమ్మరికుంట్ల మౌనిక, ఓదెల రాధిక, మద్రం లక్ష్మి, షేక్ నసీం పర్వీన్, ఇస్లావత్ ద్వాలి, బత్తుల సుజాత తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ పీ ఎస్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభం..

- ప్రభుత్వ గుర్తింపు, కనీస వేతనం కోసం పోరాటం కొనసాగిస్తాం..
- ఎస్ పీ ఎస్ నాయకులు

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్వైజర్ సిబ్బంది ఎస్ పీ ఎస్ మెడికల్ అండ్ హెల్త్ వర్కర్స్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు కోసం ఆధార్ కార్డులు, సభ్యత్వ దరఖాస్తులను రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు మాతంగి అనిల్‌కుమార్‌కు ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకుడు సిద్దెల తిరుమలరావు అందజేశారు. ఈ మేరకు సిద్ధల తిరుమలరావు ఓ ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు స్వీకరించిన సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్ మాట్లాడారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 18 వేల మంది శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్వైజర్ కార్మికులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలందిస్తున్నప్పటికీ వారికి ఇప్పటికీ ప్రభుత్వ గుర్తింపు లేకపోవడం బాధాకరమన్నారని తెలిపారు. ఆస్పత్రుల్లో రోగులకు తొలి సేవలు అందించేది ఈ కార్మికులేనని, అయినప్పటికీ తగిన గుర్తింపు, వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. బెడ్‌సైడ్ కార్మికులను ప్రభుత్వ గుర్తింపుతో ఐఎఫ్ఎంఎస్‌లో విలీనం చేసి నెలకు రూ..26 వేల కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రతతో పాటు ఈపీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అమలు చేసి, రూ.10 లక్షల ప్రమాద బీమా వర్తింపజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎస్పీఎస్ అసోసియేషన్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఎస్ పీ ఎస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కర్ల జగదీష్, జిల్లా ఉపాధ్యక్షురాలు రాయల రమ్య, జిల్లా కమిటీ సభ్యులు ఉదయ్‌కుమార్, వినోద్, మంగమ్మ, అసోసియేషన్ సభ్యులు ఉదయ్‌శ్రీ, సుజాత, భవాని, నాగుల మీరా, కీర్తి, సరిత తదితరులు పాల్గొన్నారు

## పేద రెడ్డి విద్యార్థులకు ఉచిత పోలీస్ కోచింగ్

- హైదరాబాద్‌లో ఉచిత శిక్షణ, హాస్టల్ సదుపాయం
- బుట్టెంగారి మాధవరెడ్డి
- రెడ్డి జాగృతి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కమిటీ ఎన్నిక



భద్రాద్రి కొత్తగూడెం, మహా: ఆర్థికంగా వెనుకబడిన పేద రెడ్డి విద్యార్థులకు అండగా నిలిచేందుకు రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఉచితంగా పోలీస్ కోచింగ్ నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బుట్టెంగారి మాధవరెడ్డి తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన రెడ్డి జాగృతి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అర్హులైన రెడ్డి అభ్యర్థులకు ఉచిత శిక్షణతో పాటు ఉచిత హాస్టల్, భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ ఒక్క ప్రతిభావంతుడైన విద్యార్థీ పోటీ పరీక్షల శిక్షణకు దూరం కాకూడదనే కల్పంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. పోటీ పరీక్షలలో ఉద్యోగాల సాధనే లక్ష్యంగా ఉన్న పేద రెడ్డి విద్యార్థులు రెడ్డి జాగృతి ప్రతినిధులను సంప్రదించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం రెడ్డి జాగృతి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా ముప్పని సోమిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొండా రెడ్డి, కోశాధికారిగా దుగ్గెంపూడి భాస్కర్‌రెడ్డి ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రెడ్డి జాగృతి వ్యవస్థాపక సభ్యుడు నిరుడు దయాకర్‌రెడ్డి నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందించారు. రెడ్డి జాగృతి సంస్థను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని ఈ సందర్భంగా నూతన కమిటీకి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అన్నపురెడ్డి బాలిరెడ్డి, శ్రీనివాస రెడ్డి, రమణా రెడ్డి, సుబ్బారెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి, గురవా రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## విలువలు కట్టుబడిన కమ్యూనిస్టు ఎర్రబెల్లి లక్ష్మయ్య

- ఉద్యమాలతో దిగిరాక తప్పదు
- లక్ష్మయ్య సంస్కరణ సభలో సిపిఎం నేత నున్న నాగేశ్వరావు



**కారేపల్లి, మహ :** నిత్యం ప్రజా సమస్యలపై పనిచేసే సీపీఎం కడవరకు అంటిపెట్టుకొని నైతిక విలువలతో ప్రజా సమస్యపై పోరాడిన నికార్సైన కమ్యూనిస్టు ఎర్రబెల్లి లక్ష్మయ్య అని సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం గుంపెల్లగూడెంలో సిపిఎం సీనియర్ నాయకులు అమరజీవి ఎర్రబెల్లి లక్ష్మయ్య సంస్మరణ సభ తుమ్మోజు రామ్మూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో నున్న నాగేశ్వరావు మాట్లాడుతూ మాదారం ప్రాంతంలో అనేక ప్రజా సమస్యలు పేదలకు ఇండ్లు ఇప్పించడంలోను, మంచినీటి సమస్యను పరిష్కరించడంలో, కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాటంలోనూ, గుంపెల్లగూడెం దళిత కాలనీ, గ్రామాన్ని అభివృద్ధి చేయడంలో ఎర్రబెల్లి లక్ష్మయ్య కీలకపాత్ర పోషించారని కొనియాడారు. ప్రస్తుత రాజకీయాల్లో గంటకో కండవ పూటకు పార్టీలు మారుస్తున్న నైతిక విలువలు తగ్గిపోయి వ్యవహరిస్తున్న తీరుకు భిన్నంగా తను జ్ఞాపకం ఎదిగినాక పట్టుకున్న ఎర్రజెండాను భుజాన మోసి తన కడవరకు చివరకు తన దేహం పై కప్పుకొని వెళ్లిన ఎర్రబెల్లి లక్ష్మయ్య జీవితం ధన్యమని కొనియాడారు. పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలో పడవేసిన ప్రధాని నరేంద్రమోడీ కి విద్యార్థులు గట్టి బుద్ధి చెప్పారన్నారు. విద్యార్థులపై పోలీసులు తో నిర్బంధకాండ ప్రయోగించి, ఉద్యమంపై దుష్ప్రచారం చేయించారన్నారు. విద్యార్థుల ఉద్యమంతో దిగిరాక తప్పని మోడీ విద్యాశాఖ మంత్రి ని రాజీనామా చేయించారన్నారు. ఉద్యమించిన యువతపై నిర్బంధాలు ప్రయోగించడానికి చేసిన ప్రయత్నాన్ని సిపిఎం గట్టిగా ఎదుర్కొందన్నారు. తప్పని పరిస్థితులలో యువతి, యువకులపై కేసుల విషయమై వెనక్కు తగ్గారని తెలిపారు. కార్మికులు రైతులు వ్యవసాయ కార్మికుల పేదలతో నిత్యం వారి హక్కులను చట్టాలను రద్దు చేయడం, ధరలు పెంచడం, నిరుద్యోగ సమస్య తీవ్రమవుతున్న పట్టించుకోకుండా మతాన్ని అడ్డం పెట్టుకొని తప్పించుకోవడం, దేశ ప్రజలను మోసగించడమేనన్నారు. భారత రాజ్యాంగానికి విరుద్ధంగా పాలిస్తున్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అమరజీవి ఎర్రబెల్లి లక్ష్మయ్య ప్రజల మనిషి అని బాటలో పోరాటాలతో ఆశయాలు సాధనకు కృషి చేద్దామన్నారు. అంతకు ముందు అమరజీవి ఎర్రబెల్లి లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు ,మండల కార్యదర్శి కే నరేంద్ర, కమిటీ సభ్యులు జీ.వెంకన్న, కావేటి రాములు, గుంపెల్లగూడెం శాఖ కార్యదర్శి లక్ష్మయ్య చిన్న కుమారుడు ఎర్రబెల్లి సతీష్, పెద్ద కుమారుడు రాము, ఎర్రబెల్లి ముత్తయ్య, ఎర్రబెల్లి రమాదేవి,నాగ మ్మ, కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, బిఆర్ఎస్ నాయకులు అజ్మీర వీరన్న, ఎర్రబెల్లి నాగేంద్రబాబు, లక్ష్మయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




## కాంట్రాక్ట్ కార్మికుల జీవితాలతో చెలగాటమాడితే సహించం

- శ్రమకు తగ్గ వేతనం చెల్లించాలి
- కనీస వేతనం 26,000 ఇవ్వాలి
- కార్మికులకు నష్ట దాయకంగా ఉన్న కొత్త కొత్త జీవోలను రద్దు చేయాలి
- 10న జైల్ భరోను జయప్రదం చేయాలి
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మధు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:**ప్రభుత్వ ప్రైవేట్ రంగ పరిశ్రమలలో పనిచేస్తున్న ఫిక్స్డ్ టర్మ్ నాన్ రెగ్యులర్, కాంట్రాక్టు కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడితే చూస్తూ ఊరుకోమని పోరాటాన్ని ఉధృతం చేస్తామని అందరికీ కనీస వేతనం 26,000 చెల్లించాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బి.మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు కార్యాలయంలో ఆదివారం జరిగిన ఫిక్స్డ్ టర్మ్ నాన్ రెగ్యులర్ కాంట్రాక్టు కార్మికుల ప్రథమ మహాసభను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బి.మధు మాట్లాడుతూ శ్రమదోపిడి చేస్తున్న ప్రభుత్వ ప్రైవేటు రంగాల యజమానులకు అనుకూలంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విధానాలు ఉన్నాయని ఆయన అన్నారు. కార్మికుల శ్రమను దోచుకొని కనీస వేతనం చెల్లించకుండా వారి జీవితాలతో చెలగాటం ఆడితే చూస్తూ ఊరుకోమని ఆయన హెచ్చరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్న ఎన్ఎండిసి, హెవీ వాటర్ ప్లాంట్, సింగరేణి, కేటీపీఎస్, ఐటీసీ తదితర పరిశ్రమలు పనిచేస్తున్న కార్మికుల శ్రమను గౌరవించి వారందరికీ కనీస వేతనం 26000 చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. పని గంటలు పెంచి శ్రమ దోపిడీ చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ప్రతి కార్మికుడు ప్రశ్నించాలన్నారు. కార్పొరేట్ కంపెనీలకు దాసోహం చేస్తున్న పాలకవర్గ విధానాలపై ప్రతి కార్మికుడు ముక్తకంఠంతో ఎదిరించాలని ఆయన అన్నారు. కార్పోరేట్ సంస్థలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న క్విట్ కార్పోరేట్ క్విట్ మోడీ నినాదంతో జైల్ భరో కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికులు ఔట్సోర్సింగ్ కార్మికులు ఫిక్స్డ్ టర్మ్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికులకు వ్యతిరేకంగా వారి పని గంటలు పెంచుతూ జీతాలను తగ్గిస్తూ కొత్త కొత్త ప్రభుత్వ ఉత్తర్వులను ప్రవేశపెట్టి వారి జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్న పాలకులపై కన్నెర్ర జేయాలని అన్నారు. కార్మిక సంఘాలతో చర్చించకుండా వారి శ్రమను గుర్తించకుండా వేతనాలు తగ్గిస్తూ విడుదల చేస్తున్న జీవోలను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.ఈ సభకు సిఐటియు జిల్లా అధ్యక్షులు బ్రహ్మచారి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజె రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డా రవి, సహాయ కార్యదర్శి కే.సత్య, భూక్య రమేష్, మాతంగి రాజేష్, నాయకులు పాషా, అల్లి నాగయ్య, శివ, గోపాల్, నాగేశ్వర రావు, సతీష్, బత్తుల గోపాలరావు, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణిలో ఖాళీ పోస్టుల భర్తీకి వ్రాత పరీక్ష

**ద్రాద్రి కొత్తగూడెం,** మహా:సింగరేణి కాలరీస్ కంపెనీలో ఖాళీగా ఉన్న ఫార్మసిస్ట్ టి అండ్ఎస్ గ్రేడ్‌డి పోస్టులను అంతర్గత అభ్యర్థులతో భర్తీ చేసే దానిలో భాగంగా ఆదివారం సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పిజి కళాశాలలో వ్రాత పరీక్ష నిర్వహించటం జరిగింది. 19 పోస్టుల ఖాళీలకుగాను అర్హులైన 203 మంది అభ్యర్థులకు హాల్ టికెట్లు జారీ చేయగా 196 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ వ్రాత పరీక్ష విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ సిబ్బంది పర్యవేక్షణలో సిసి కెమెరాల నిఘా మధ్య నిర్వహించటం జరిగింది. సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పిజి కళాశాలలో జరిగిన ఈ పరీక్షను జిఎం(పర్సనల్) ఈఈ అండ్ ఆర్‌సి ఏ.జే.ఎం మురళీధరరావు, ఏజీఎం(విజిలెన్స్)ఎస్.వి.మురళీధర రాజు పర్యవేక్షించి పరీక్ష పూర్తిగా మెరిట్ పై ఆధారపడి ఉంటుందని దళారులకు ఎలాంటి ప్రమేయం ఉండదని వారిని నమ్మి ఎవరూ మోసపోవద్దని సూచించారు. ఈ పరీక్ష ఫలితాలు సింగరేణి వెబ్‌సైట్ సింగరేణి ప్రధాన కార్యాలయ ముఖద్వారం వద్ద నోటీస్ బోర్డుద్వారా తెలియజేయటం జరుగుతుందని తెలిపారు. ఈ పరీక్ష నిర్వహణ పరిశీలనలో ఏజి ఎం (పర్సనల్) పి.వేణుగోపాలరావు, పర్సనల్ మేనేజర్ బి.సమ్మయ్య డివైపిఎం డి.నాగేశ్వర రావు, విజిలెన్స్ఆఫీసర్స్ కే.రామకృష్ణ, ఎండి.హాషిం పాషా, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతా శారద, ఇతర అధికారులు విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ సిబ్బంది రిక్రూట్మెంట్ ఉద్యోగులు పాల్గొన్నారు

## ప్రజా ఆరోగ్యం ప్రభుత్వాల బాధ్యత

- ప్రపంచీకరణలో ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేస్తున్న పాలకులు
- ఎయిమ్స్ వైద్యులు విజయ్ కుమార్




**కుషాయిగూడ, మహా:** సిపిఎం పార్టీ మల్కాజ్గిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రజా వైద్యం అనే దానిమీద డాక్టర్ ఎస్ రావు నగర్ సీనియర్3 సిటిజన్ హాల్లో సదస్సు జరిగింది. ఈ సదస్సుకు పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుజె. చంద్రశేఖర్ అధ్యక్షత నా వహించగా ముఖ్యవక్తగా హాజరైన ఎయిమ్స్ డాక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ, జబ్బు రాకముందే ఆరోగ్యంపై అవగాహన ముఖ్యమని, జబ్బు వచ్చిన తర్వాత నానా రకాల టెస్టులు చేస్తున్నారన్నారు. కోవిడ్ వచ్చినప్పుడు అనేక వేల మంది చనిపోయారని, దీనికి కారణం ప్రభుత్వాల ముందుచూపు లేకపోవడం అని అన్నారు. అమెరికా చిన్న వైరస్ అయిన కోవిడ్ ను తట్టుకోలేక అతలాకుతలం అయిందన్నారు. అమెరికాలో కోవిడ్ వచ్చిన తర్వాత వెంటిలేటర్స్ లేకపోవటం వలన చాలామంది చనిపోయారని అన్నారు. దీనికి పూర్తిగా వైద్యాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడమేనని అన్నారు. ప్రపంచంలో ఎక్కడా కూడా ప్రజా ఆరోగ్య మీద శ్రద్ధ పెట్టటం లేదని తెలిపారు. ఇటలీలో కోవిడ్ వచ్చిన తర్వాత హాస్పిటల్స్ డాక్టర్స్ సరిపోలేదని వారికి వైద్యం చేయటానికి క్యూబా నుంచి వైద్యులు వచ్చి వైద్యం చేశారని తెల్లవాళ్ళకి నల్లవాళ్లు వైద్యం చేశారని అన్నారు. వైద్యం విషయంలో సోషలిస్టు దేశాలు ప్రపంచంలో అన్ని దేశాల కన్నా ముందున్నాయని తెలిపారు.తెలంగాణలో ప్రజల జీవన ప్రమాణాలు తగ్గాయని 2014 ముందు తెలంగాణలో ఫ్యూడల్ సమాజం ఉందని తర్వాత లేదని తెలిపారు. తెలంగాణలో ఫ్యూడలిజం తగ్గటానికి కారణం కమ్యూనిస్టులే కారణమని అన్నారు. ఈ పరిస్థితి రావడానికి కొన్ని వేల మంది ప్రాణాలర్పించారని తెలిపారు. మొదట్లో తెలంగాణలో మూడు హాస్పిటల్స్ మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు చాలా హాస్పిటల్స్ వచ్చాయని అన్నారు. ఇప్పుడు సంవత్సరానికి 10,000 మంది డాక్టర్స్ తయారవుతున్నారని, ఇప్పుడున్న డాక్టర్స్ సరైన ప్రతిభ లేకుండా వైద్యం చేస్తున్నారని అన్నారు. ఇప్పుడున్న మెడికల్ కాలేజీలు చాలా లోపభూయిష్టంగా ఉన్నాయని తెలిపారు. ఇప్పుడు పీజీ చదివే డాక్టర్స్ కోటికి పైగా డొనేషన్ ఇచ్చి జాయిన్ అవుతున్నారని సరిగా క్లాసెస్ కి వెళ్ళరని మరి వారు బయటకు వచ్చిన తర్వాత వారి వైద్యం ఎలా ఉంటుందో మనం అర్థం చేసుకోవాలని అన్నారు. ఇంకో నాలుగైదు సంవత్సరాల్లో పూర్తిగా ప్రైవేట్ హాస్పిటల్స్ ప్రైవేట్ డాక్టర్సే ఉంటారని తెలిపారు. ఎక్కువ మెడికల్ కాలేజీలు పెట్టినంతమాత్రాన అభివృద్ధి అనుకోలేమని వంద మందిగర్భిణీలకు 60నుండి 70 మందికి సిజేరియన్ చేస్తున్నారని ఇది చాలా ప్రమాదకరమని అన్నారు. ప్రభుత్వాలు డాక్టర్స్ కి సరైన ట్రైనింగ్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.డాక్టర్స్ కి జబ్బులు గురించి సరైన అవగాహన లేకుండా ఉంటుందని అన్నారు. ప్రభుత్వాలు డాక్టర్స్ కి పల్లెటూరులో పనిచేయటానికి అవసరమైన ట్రైనింగ్ ఇవ్వడం లేదని తెలిపారు. కార్పొరేట్ హాస్పటల్ కి ఏ సమస్య మీద వెళ్లిన లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. ఒక దేశం అభివృద్ధికి సూచిక ప్రజారోగ్యం,విద్య అని అన్నారు. భారతదేశంలో ఈ రెండిటికి ప్రాధాన్యత ఇవ్వటం లేదని తెలిపారు ఈ దేశంలో మార్పు తెచ్చేది కమ్యూనిస్టులని అన్నారు. సిపిఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం విద్యా, వైద్యానికి మొదట ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. విద్య, వైద్యాన్ని పాలకవర్గాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలిపారు. వైద్యం మొత్తం ప్రభుత్వ రంగంలో ఉండాలని నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యం వ్యాపారంగా మారకూడదని అన్నారు. వైద్యాన్ని ప్రైవేటుపరం చేసే పనిలో పాలకవర్గాలు ఉన్నాయని అన్నారు. ఏ పార్టీలైనా పాలకవర్గాల విధానాలు ఒకటేనని అన్నారు.ఇప్పుడున్న పాలకులు వైద్యాన్ని కూడా మూఢనమ్మకాల వైపు తీసుకెళ్తున్నారని, ఆవు మూత్రం తాగితే అన్ని రోగాలు పోతాయని ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఒక మనిషి సంపాదనలో 70% శాతం వైద్యానికే ఖర్చు పెడుతున్నారు.వైద్యం విషయంలో కేరళ మినహా అన్ని రాష్ట్రాలు చాలా బలహీనంగా ఉన్నాయని తెలిపారు. సిపిఎం పార్టీ మేడ్చల్ మల్కాజి జిల్లా కార్యదర్శి పి. సత్యం మాట్లాడుతూ అనారోగ్యం రాకముందే ప్రభుత్వాలు జాగ్రత్తలు తీసుకోవాలని, పారిశుద్ధ్యం, వాటర్ విద్య ఈ విషయాలలో ప్రభుత్వాలు ముందు జాగ్రత్తలు తీసుకుంటే ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ఉంటారని తెలిపారు. ఆరోగ్యం లేకుండా సంపద సృష్టించడం అసాధ్యమని మార్క్స్ చెప్పారు.ప్రతి మనిషికి ఆరోగ్యంగా జీవించే హక్కుప్రభుత్వాలు కల్పించాలని సుప్రీంకోర్టు కూడా తీర్పు చెప్పింది అని అన్నారు. సోషలిస్టు క్యూబా లో ప్రైవేట్ హాస్పిటల్స్ లేవు. అన్ని హాస్పిటల్స్ ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయని అన్నారు. క్యూబా లో ప్రతి వందమందికి ఒక డాక్టర్ ఉంటాడని, మన దేశం లో వైద్యం కేరళలో ఉన్నట్టు మరి ఏ రాష్ట్రాల్లో లేదు. మరి ఈ పాలకులు ఇతర రాష్ట్రాలలో ఎందుకు అమలు చేయలేదని అన్నారు.ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం వైద్యం అన్ని రకాల సౌకర్యాలు పెంచాలని హాస్పటల్ సంఖ్య పెంచాలని అలాగే ఖాళీలు ఉన్నచోట డాక్టర్స్ ని నియమించాలని కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోమటి రవి .వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. శ్రీనివాసులు, ఎం. వినోద, ఎర్ర అశోక్ జిల్లా కమిటీ సభ్యులు ఎన్. శ్రీనివాస్, ఆర్. సంతోష్, లింగస్వామి, జి లక్ష్మణ్, పార్టీ సీనియర్ నాయకులు యాదయ్య, సోమయ్య చారి, పటాకి శ్రీనివాస్, గణేష్ యాదగిరి రావు, మంగ,తదితరులు పాల్గొన్నారు.





## కారేపల్లి మండలంలో పలు మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

**కారేపల్లి, మహా:** సింగరేణి మండలంలో వివిధ గ్రామాలలో మృతి చెందిన మృతుల కుటుంబాలను వైరా శాసనసభ్యులు మాలోత్ రామదాసు నాయక్ ఆదివారం పరామర్శించారు. గుంపెళ్ళగూడెం గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఎర్రబల్లి పెద్ద లక్ష్మయ్య కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే బజ్జ తండాలో గుండెపోటుతో మరణించిన అజ్మీర లక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అక్కడనుండి విశ్వనాథపల్లి గ్రామంలో విద్యుత్ షాక్ తో మృతి చెందిన మహిళా రైతు వడ్డే ఉమా కుటుంబ సభ్యులను ఓదార్చి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోటకూరి పిచ్చయ్య ను ప్రత్యేకంగా కలిసి కొంతసేపు చర్చలు జరిపారు. ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షులు తోటకూరి రాంబాబు,సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ రామ్మూర్తి నాయక్, పెద్దబోయిన ఉమాశంకర్,మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు భూక్య రంజిత్ కుమార్ , వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు,మండల పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు చేపట్టిన



## కౌన్సిలర్ మహేష్..

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్కేపల్లి 11వ వార్డులో చాలా కాలంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న రహదారి సమస్యను స్థానిక కౌన్సిలర్ మహేష్ తన సొంత నిధులతో పరిష్కరించేందుకు ముందుకొచ్చారు. 11 వార్డులోని స్వీట్ హౌస్ సమీపం నుంచి మైసమ్మ ఆలయం వరకు రహదారి మధ్యలో ఏర్పడిన గుంతలకు ఆదివారం ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టించారు. ఎన్నో రోజులుగా రహదారి దెబ్బతినడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రజల విజ్ఞప్తిని స్వీకరించిన కౌన్సిలర్ మహేష్ తన సొంత ఖర్చుతో మరమ్మతు పనులు ప్రారంభించారని స్థానికులు తెలిపారు. రోడ్డు మరమ్మతు పనులు పూర్తయితే ప్రమాదాల నివారణతో పాటు ప్రయాణం సౌకర్యవంతంగా మారుతుందని ప్రజలు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో వెంటనే స్పందించి సొంత నిధులతో పనులు చేపట్టిన కౌన్సిలర్ మహేష్‌ను స్థానికులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు

## బస్‌స్టాప్ కోసం పోరుబాట

**కుషాయిగూడ, మహా :** కుషాయిగూడ ప్రధాన రహదారిలో ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించి బస్సుల రాకపోకలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మహాధర్నా నిర్వహించనున్నారు.ఉదయం 9.30 గంటలకు కుషాయిగూడ బస్‌స్టాప్ వద్ద చేపట్టనున్న ఈ ఆందోళనలో స్థానికులు, వ్యాపారులు, విద్యార్థులు, మహిళలు, యువత పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. బారికేడ్ల కారణంగా కుషాయిగూడ బస్‌స్టాప్‌కు వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బస్సులు తిరిగేందుకు ఇబ్బందిగా మారడంతో ఇప్పటికే 3కే, 17 బస్ సర్వీసులు నిలిచిపోయాయని, ప్రస్తుతం 117 బస్సు మాత్రమే నడుస్తోందని పేర్కొన్నారు. దీనివల్ల కుషాయిగూడ బస్ టెర్మినల్ భవిష్యత్తుపై ఆందోళన నెలకొందన్నారు.ట్రాఫిక్ సమస్యలకు ప్రత్యామ్నాయ పరిష్కారాలు చూపించి, బారికేడ్లను తొలగించి ప్రజా రవాణా సౌకర్యాలను కొనసాగించాలని అధికారులను కోరుతూ ధర్నా చేపడుతున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

# సంప్రదాయ లుక్‌లో మెరిసిన నభా నటేష్

దక్షిణ భారతీయ సంప్రదాయ అందాలను ఆవిష్కరిస్తూ నటి నభా నటేష్ తాజాగా నిర్వహించిన ఫొటోషూట్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. పండుగ వాతావరణాన్ని గుర్తు చేసే ఈ ఫొటోల్లో ఆమె ధరించిన సంప్రదాయ దుస్తులు, హుందాతనం, చిరునవ్వు ప్రతి ఒక్కరినీ ఆకర్షిస్తున్నాయి. సోషల్ మీడియాలో ఈ చిత్రాలు వైరల్ అవుతూ నెటిజన్ల నుంచి ప్రశంసలు అందుకుంటున్నాయి.
ఒక లుక్‌లో నభా నటేష్ ఆకర్షణీయమైన ఆకుపచ్చ రంగు లంగా-ఓణీతో పాటు రాయల్ బ్లూ రంగులో నాజూకైన ఎంబ్రాయిడరీతో రూపొందించిన బ్లౌజ్‌ను ధరించారు. ఆలయ శైలిలో రూపొందించిన బంగారు ఆభరణాలు ఆమె రూపానికి మరింత రాజసాన్ని తీసుకొచ్చాయి. సంప్రదాయ అలంకరణతో ఆమె అందం మరింత మెరిసిపోయింది.మరో లుక్‌లో ఆవాల పసుపు, ముదురు ఊదా రంగుల కలయికతో ఉన్న చీరలో ఎంతో హుందాగా కనిపించారు. జడలో మల్లెపూలు, ఆలయ నగలు ఆమె రూపానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ రెండు రూపాల్లోనూ నభా నటేష్ సంప్రదాయ భారతీయ మహిళ సౌందర్యాన్ని ఎంతో సహజంగా ప్రతిబింబించారని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.సినీ కెరీర్ విషయానికి వస్తే, నభా నటేష్ వరుస చిత్రాలతో బిజీగా కొనసాగుతున్నారు. ఇటీవల ప్రియదర్శితో కలిసి నటించిన రొమాంటిక్ కామెడీ చిత్రం 'డార్లింగ్'లో ప్రధాన పాత్రలో మెప్పించిన ఆమె, ప్రస్తుతం 'స్వయంభు', 'టైసన్ నాయుడు', అలాగే ఫాంటసీ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' వంటి భారీ ప్రాజెక్టుల్లో నటిస్తున్నారు.తెరపై తన నటనతో ప్రేక్షకులను అలరిస్తూనే, మరోవైపు సంప్రదాయ ఫొటోషూట్లతో అభిమానులను మంత్రముగ్ధులను చేస్తున్న నభా నటేష్, గ్లామర్‌తో పాటు సాంప్రదాయ సొగసును సమానంగా ఆవిష్కరించే కథానాయికగా తన ప్రత్యేక గుర్తింపును రింత బలపరుచుకుంటున్నారు.



# కింగ్ 100కు డీఎస్పీ సంగీతం

అక్కినేని నాగార్జున కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 100వ చిత్రం 'కింగ్ 100'పై మరో ఆసక్తికరమైన అప్‌డేట్ వచ్చింది. సినిమా ప్రకటించినప్పటి నుంచే ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొనగా, ఇప్పుడు చిత్ర బృందం సంగీత దర్శకుడిగా రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్‌ను ఎంపిక చేస్తూ అధికారిక ప్రకటన చేసింది. దీంతో అభిమానుల్లో సినిమా పట్ల మరింత ఆసక్తి పెరిగింది.ఆదివారం దేవి శ్రీ ప్రసాద్ 47వ పుట్టినరోజు సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. జాతీయ అవార్డు గ్రహీత అయిన డీఎస్పీకి స్వాగతం పలుకుతూ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ ప్రకటనతో సోషల్ మీడియాలో 'కింగ్ 100' మరోసారి హాట్ టాపిక్‌గా మారింది.నాగార్జున–దేవి శ్రీ ప్రసాద్ కాంబినేషన్ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. గతంలో 'మన్మధుడు', 'మాస్', 'కింగ్', ఇటీవల విడుదలైన 'కుబేర' వంటి చిత్రాలకు డీఎస్పీ సంగీతం అందించి మంచి విజయాలను అందుకున్నారు. ముఖ్యంగా ఈ కాంబోలో వచ్చిన పాటలు, నేపథ్య సంగీతం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇప్పుడు మరోసారి ఈ హిట్ కాంబినేషన్ 'కింగ్ 100' కోసం కలిసి పనిచేయడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.ఇప్పటికే ఈ చిత్రంలో ప్రముఖ నటి టబు కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. గతంలో నాగార్జున–టబు జంట ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించింది. చాలా కాలం తర్వాత ఈ హిట్ జోడీ మరోసారి వెండితెరపై కనిపించనుండటంతో అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. నాగార్జున కెరీర్‌లో మైలురాయిగా నిలిచే 100వ చిత్రంగా రూపొందుతున్న 'కింగ్ 100' నుంచి మరిన్ని ఆసక్తికరమైన అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.








# పూజా హెగ్డేకు పెళ్లి ఫిక్సా?

సినీ పరిశ్రమలో తరచూ కనిపించే ఓ ఆసక్తికరమైన ధోరణి ఉంది. ఒక హీరోయిన్ కెరీర్ కొంత మందగించినా, వెంటనే ఆమె వ్యక్తిగత జీవితంపై ఊహాగానాలు మొదలవుతాయి. ముఖ్యంగా పెళ్లికి సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతుంటాయి. ప్రస్తుతం నటి పూజా హెగ్డే చుట్టూ వినిపిస్తున్న పెళ్లి ప్రచారం కూడా ఇదే కోవలోకి వస్తోంది. ఆమె అరేంజ్డ్ మ్యారేజ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందనే వార్తలు ప్రచారంలో ఉన్నప్పటికీ, ఇప్పటివరకు దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.హీరోయిన్ల విషయంలో కెరీర్, వయసు, వ్యక్తిగత జీవితం అనే మూడు అంశాలను ఒకే కోణంలో చూడడం వల్లే ఇలాంటి ప్రచారాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఒక హీరో వరుస పరాజయాలు ఎదుర్కొన్నా అతని తదుపరి సినిమా గురించే ఎక్కువగా చర్చ జరుగుతుంది. కానీ హీరోయిన్ విషయంలో మాత్రం కెరీర్ కాస్త నెమ్మదించినా వెంటనే పెళ్లి, కుటుంబ జీవితం, సినిమాలకు గుడ్‌బై చెప్పబోతుందనే ఊహాగానాలు మొదలవుతాయి.పూజా హెగ్డే కెరీర్‌ను పరిశీలిస్తే, ఒక దశలో ఆమె టాలీవుడ్‌లో అత్యంత బిజీ స్టార్ హీరోయిన్లలో ఒకరిగా నిలిచారు. అగ్రహీరోల సరసన వరుస విజయవంతమైన చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించారు. అయితే ఇటీవల భారీ అంచనాలతో విడుదలైన కొన్ని చిత్రాలు ఆశించిన విజయాన్ని అందుకోకపోవడంతో ఆమె కెరీర్ వేగం కొంత తగ్గిన మాట వాస్తవమే. అయినప్పటికీ, కొన్ని పరాజయాలతోనే కెరీర్ ముగిసిపోయిందని చెప్పడం సరికాదు. గతంలో పలువురు హీరోయిన్లు వరుస ఫ్లాప్‌ల తర్వాత కూడా విజయవంతంగా తిరిగి రాణించిన ఉదాహరణలు ఉన్నాయి.ప్రస్తుతం పూజా హెగ్డే చేతిలో కొత్త ప్రాజెక్టులు ఉండటంతో పాటు, దక్షిణాది చిత్రాలపై మరోసారి దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సమయంలోనే ఆమె పెళ్లి వార్తలు వెలుగులోకి రావడం యాదృచ్ఛికమా? లేక కెరీర్ మార్పు దశలో ఉన్న హీరోయిన్లపై సహజంగానే పెరిగే మీడియా, సోషల్ మీడియా ఆసక్తి ఫలితమా? అనే చర్చ కూడా సాగుతోంది.మొత్తానికి, పూజా హెగ్డే పెళ్లిపై వస్తున్న వార్తలను అధికారిక ప్రకటన వచ్చే వరకు కేవలం ఊహాగానాలుగానే చూడాల్సి ఉంటుంది. హీరోయిన్ల కెరీర్‌లో చిన్న మార్పు వచ్చిన ప్రతిసారి దానిని వారి వ్యక్తిగత జీవితంతో, ముఖ్యంగా పెళ్లితో ముడి పెట్టడం ఇప్పటికీ సినీ పరిశ్రమలో కొనసాగుతున్న సామాజిక ధోరణికి నిదర్శనంగా కనిపిస్తోంది.

# మహేష్ బర్త్‌డే స్పెషల్‌గా దూకుడు రీ రిలీజ్

మహేష్ బాబు అభిమానులకు ఆగస్టు నెల అంటే ప్రత్యేకమైన పండుగ. ప్రతి ఏడాది ఆయన పుట్టినరోజును అభిమానులు ఘనంగా జరుపుకుంటారు. ఈసారి ఆ వేడుకలకు మరింత ప్రత్యేకత తీసుకొస్తూ మహేష్ కెరీర్‌లోని బ్లాక్‌బస్టర్ హిట్ 'దూకుడు' మరోసారి వెండితెరపై సందడి చేయనుంది. ఆగస్టు 9న మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రాన్ని రీమాస్టర్డ్ 4కే వెర్షన్‌లో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో రీ రిలీజ్ చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో అభిమానుల్లో ఇప్పటికే భారీ ఉత్సాహం నెలకొంది.
2011లో విడుదలైన 'దూకుడు' అప్పట్లో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. దర్శకుడు శ్రీను వైట్ల తెరకెక్కించిన ఈ యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్‌లో మహేష్ బాబు స్టైలిష్ నటన, కామెడీ టైమింగ్, పంచ్ డైలాగులు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సమంత కథానాయికగా నటించిన ఈ చిత్రం ఇప్పటికీ టెలివిజన్‌లో ప్రసారమైనప్పుడల్లా మంచి ఆదరణ పొందుతోంది. ఇప్పుడు అదే చిత్రాన్ని అత్యుత్తమ విజువల్ క్వాలిటీతో మరోసారి థియేటర్లలో ఆస్వాదించే అవకాశం అభిమానులకు లభిస్తోంది.చిత్ర బృందం వెల్లడించిన వివరాల ప్రకారం అడ్వాన్స్ బుకింగ్‌లు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. రీమాస్టర్డ్ 4కే ప్రింట్‌తో విడుదలవుతున్న ఈ సినిమా మరింత మెరుగైన చిత్ర నాణ్యతతో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనుంది. గతంలో రీ రిలీజ్ అయిన మహేష్ బాబు చిత్రాలకు అభిమానులు భారీ స్పందన ఇచ్చిన నేపథ్యంలో 'దూకుడు' కూడా రికార్డు స్థాయి ఓపెనింగ్స్ సాధించే అవకాశముందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.దాదాపు రెండు దశాబ్దాలుగా తెలుగు సినీ పరిశ్రమలో అగ్రహీరోగా కొనసాగుతున్న మహేష్ బాబు 'ఒక్కడు', 'పోకిరి', 'దూకుడు', 'బిజినెస్‌మ్యాన్', 'శ్రీమంతుడు', 'మహర్షి', 'సరిలేరు నీకెవ్వరు', 'సర్కారు వారి పాట' వంటి వరుస



విజయాలతో ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. కమర్షియల్ చిత్రాలతో పాటు సామాజిక సందేశం ఉన్న కథలను కూడా ఎంపిక చేసుకుంటూ తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ను ఏర్పరుచుకున్నారు.ప్రస్తుతం మహేష్ బాబు దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ వరల్డ్ చిత్రం 'వారణాసి' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ గ్లోబల్ యాక్షన్ అడ్వెంచర్ మూవీలో ప్రియాంక చోప్రా జోనాస్, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని 2027 ఏప్రిల్ 7న విడుదల చేయాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకుంది.ఒకవైపు 'వారణాసి'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొనగా, మరోవైపు 'దూకుడు' రీ రిలీజ్ మహేష్ అభిమానులకు డబుల్ ట్రీట్‌గా మారింది. పుట్టినరోజు వేడుకల సందర్భంగా అభిమాన హీరో కెరీర్‌లో చిరస్థాయిగా నిలిచిన ఈ బ్లాక్‌బస్టర్‌ను మరోసారి థియేటర్లలో వీక్షించే అవకాశం రావడంతో అభిమానులు ఇప్పటికే భారీగా బుకింగ్‌లు చేసుకుంటున్నారు. ఈ రీ రిలీజ్‌తో మరోసారి సినిమా హాళ్లు మహేష్ అభిమానుల సందడితో మార్మోగనున్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com